

పేర్లు నమోదు చేసుకుంటున్న తల్లిదండ్రులు

చిన్నారులకు.. శ్రవణానందం



కేంద్రం వద్ద ఓ చిన్నారి

చిన్నారులు, వారి తల్లిదండ్రులతో రుయా ప్రాంగణం శనివారం సందడిగా మారింది. జిల్లా బాలల స్వాస్థ్య చికిత్సా కేంద్రంలో శనివారం వినికిడి పరీక్షల శిబిరం నిర్వహించారు. 0- 18 ఏళ్లలోపు చిన్నారులు 150 మంది హాజరు కాగా 135 మందికి పరికరాలు అవసరమని గుర్తించారు. డిసెంబరు 3వ తేదీన ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా.. విజయవాడలో నిర్వహించే కార్యక్రమంలో ముఖ్యమంత్రి వారికి వినికిడి పరికరాలు అందించనున్నారు. వినికిడి సమస్యతో బాధపడేవారు ఉండకూడదనే ఉద్దేశంతో శ్రవణాంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్రంలో నిర్వహిస్తున్నారు. ఈఎన్‌టీ హెచ్‌వోడీ శ్రీనివాసరావు, ఆర్‌బీఎస్‌కే అండ్ ఎస్‌సీపీ డా. పద్మావతి, డీఎస్‌సీ మేనేజర్ గుణశేఖర్ తదితరులు కార్యక్రమం పర్యవేక్షించారు. - న్యూస్‌టుడే, తిరుపతి (వైద్యవిభాగం)



వినికిడి పరీక్షలు చేస్తున్న దృశ్యం. చిత్రంలో ఈఎన్‌టీ హెచ్‌వోడీ శ్రీనివాసరావు, డా.పద్మావతి, డీఎస్‌సీ మేనేజరు గుణశేఖర్

వలస జీవనం.. విలాస భవనం

➡ ఇదీ.. తిమ్మరాజుపల్లె కష్టజీవుల ప్రత్యేకం

ఆదివారం ప్రత్యేకం

మారుమూల అటవీ ప్రాంతంలోని కుగ్రామంలో వంద కుటుంబాలు.. ఒకే కులస్థులు.. నిత్యం కష్టపడితేనే కుండగాలి.. లేకుంటే ఎండగాలి.. అన్న సామెతలా బతుకులు సాగిస్తున్న ప్రజలు.. రెక్కల కష్టార్జితంతో విలాస జీవనాన్ని సాకారం చేసుకొంటున్నారు. కేరళ తరహాలో డూప్లెక్స్ ఇళ్లు.. అధునాతన సౌకర్యాలతో రూపుదాల్చిన ఆ ఊళ్లోకి ఇతరులెవరైనా వెళ్లగానే.. నిజంగా ఇది వలసల గ్రామమేనా.. అని ఒకింత సందేహానికి గురి కావాల్సిందే.



డూప్లెక్స్ నివాసాలు

జిల్లాలో తమిళ, కన్నడ రాష్ట్రాల సరిహద్దుల నడుమ.. మారుమూల ప్రాంతమైన కుప్పం నియోజకవర్గంలో పదుల సంఖ్యలో వలస గ్రామాలున్నాయి. శాంతిపురం మండలంలోని తిమ్మరాజుపల్లెలోనూ ఇంటింటా వలస బతుకులే. దాదాపు రెండు వందల ఏళ్ల కిందట ఏర్పాటైన గ్రామంలో వ్యవసాయేతర కుటుంబాలే అధికం. తరతరాలుగా రాతి, మట్టి పనులకు అలవాటుపడిన ప్రతి కుటుంబంలోనూ వలస జీవనాలు సాగిస్తున్నారు. బెంగళూరులో భవన నిర్మాణ పనులు, మట్టి తవ్వకాలతో దశాబ్దాల తరబడి జీవనాలు సాగిస్తున్న కష్టజీవులకు స్వగ్రామంపై మమకారం పోలేదు. ఏడాదంతా పొరుగు రాష్ట్రంలో పొట్టకూటి కోసం కష్టాన్ని ఇష్టపడినా.. పండుగలు, వేడుకలకు సొంతూళ్లలో వాలిపోతుంటారు.



తిమ్మరాజుపల్లెలో విలాస భవనం

అందాల భవంతులు.. అధునాతన వసతులు

రెక్కల కష్టం సంపాదనతో చక్కటి ఇళ్లు నిర్మించుకుంటున్నారు. కేరళ తరహాలో డూప్లెక్స్ భవంతులు చూడచక్కని అందాలతో రూపుదిద్దుకున్నాయి. నగరాలను తలపించే విధంగా అధునాతన హంగులు, సకల సౌకర్యాలతో కూడిన బహుళ అంతస్తుల భవనాలు వారి సొంతం. దాదాపు 25 కుటుంబాలకు కార్లు సైతం ఉన్నాయి. కన్నవారి కష్టంతో చదువులను ఇష్టపడిన పలువురు యువకులు దేశ, విదేశాల్లో ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నారు.

రూ.50 లక్షలతో ఆలయం


గ్రామస్థుల సమష్టి కష్టంతో చక్కటి ఆలయాన్ని నిర్మించుకున్నారు. దాదాపు రూ.50 లక్షలతో రూపుదిద్దుకున్న ప్రసన్న గంగమాంబ ఆలయంలో ఏటా జాతర మహోత్సవాలకు వలస జనమంతా తరలి వచ్చి.. రూ.లక్షల ఖర్చుతో పూజలు, వేడుకలు వైభవంగా నిర్వహిస్తారు.

- న్యూస్‌టుడే, శాంతిపురం



గ్రామస్థులు నిర్మించుకున్న ఆలయం

చిలకమ్మా.. స్నేహం బాగుందమ్మా



ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహిళ భుజంపై రామచిలుక

తిరుపతిలోని గాలి వీధిలో నివాసం ఉండే సరళ రామచిలుకతో స్నేహం చేస్తోంది. తను ఎక్కడికెళ్లినా చిలుకను వెంట తీసుకెళ్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఆరు నెలల క్రితం చెట్టుపై నుంచి పడిన చిలుకను సంరక్షిస్తూ దానికి పేరు పెట్టి బాగోగులు చూసుకుంటోంది. ఇంట్లో తినే ఆహార పదార్థాలను ఆహారంగా అందిస్తున్నామని చెబుతున్నారు సరళ. శీతల పానీయం తాగుతుంటే ఆమె నోటి నుంచి చిలుక తాగడం, ఆమెను ఇతరులు తాకే ప్రయత్నం చేస్తే కొరకడానికి వస్తూ ఆకట్టుకుంటోంది. - ఈనాడు, తిరుపతి



సరళతో పాటు శీతల పానీయం తాగుతూ..

కైలాసకోన కనువిందు

తాజా వర్షాలకు కోనల్లో జలపాతాలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. ప్రమాదాలు పొంచి ఉన్న నేపథ్యంలో చాలా కోనలకు పర్యాటకులను అనుమతించడం లేదు. నారాయణవనం మండలం కైలాసకోన జలపాతానికి అనుమతించడంతో ఆహ్లాదం పొందుతున్నారు. పచ్చని చెట్ల నడుమ కొండపై నుంచి జాలువారే జలపాతం ఆకట్టుకుంటోంది. ప్రకృతి ఒడిలో జలపాత సౌందర్యాన్ని వీక్షించేందుకు జిల్లా నలుమూలల నుంచే కాక తమిళనాడు నుంచి పర్యాటకులు తరలివస్తున్నారు.

- న్యూస్‌టుడే, నారాయణవనం





ఊడల మర్రి.. ఊసులినాల్సిందే

ఒకటిన్నర ఎకరంలో విస్తరించిన 400 ఏళ్ల క్రితం నాటి ఈ ఊడల మర్రి ఊసులు వినాల్సిందే. ఈ చెట్టు ఏ అభయారణ్యంలోనో కాదండోయ్.. పాలసముద్రం మండలంలోని రాచపాళ్యం గ్రామంలోనిది. తరాలు మారుతున్నా ప్రకృతి అవాంతరాలను తట్టుకుని ఇంకా స్థిరంగా నిలబడే ఉంది. గుబురుగా పెరిగిన ఈ కొమ్మలు ఇటుగా వెళ్లేవారికి పచ్చటి పరిమళాలు వెదజల్లుతూ.. వర్షంలో గొడుగు పడుతోంది. ఈ చెట్టు నిండా అల్లుకున్న ఊడలు పిల్లలకు ఆటలాడుకునే ఉయ్యాలలవుతూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ మర్రి మొదట్లో ఏకశిల బాలగురునాథీశ్వర స్వామిని ప్రతిష్ఠించడం విశేషం.

- న్యూస్‌టుడే, పాలసముద్రం

సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: ఎస్‌ఎస్‌డీ టోకెన్లు లేకుండా శనివారం సాయంత్రానికి క్యూలైన్లలో వచ్చిన భక్తులకు దాదాపు 8 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. శుక్రవారం శ్రీవారిని 61,576 మంది దర్శించుకోగా రూ.3.54 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

పురపాలికల్లో మెరుగైన సేవలు అందించాలి

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: జిల్లాలోని పురపాలికలు, నగరపాలక పరిధిలోని ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ డా.వెంకటేశ్వర్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో జేసీ శుభం భన్సల్, నగరపాలక సంస్థ కమిషనర్ నారపురెడ్డి మౌర్య, పురపాలక కమిషనర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలన్నారు. నీటిశుద్ధి ప్లాంట్లు, డంపింగ్ యార్డులకు సంబంధించిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు సరఫరా చేయాలన్నారు. అధికారులు సుబ్బరాయుడు, గిరికుమార్, చిన్నయ్య, షేక్‌ఫజురుల్లా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ డా.వెంకటేశ్వర్, చిత్రంలో శుభం భన్సల్, కమిషనర్ నారపురెడ్డి మౌర్య తదితరులు

కార్డుదారులకు నవంబరులో జొన్నల పంపిణీ

◗ ఈ నెలలో 86.75% మందికి రేషన్



తిరుపతి (రెవెన్యూ), న్యూస్‌టుడే: బియ్యం కార్డుదారులకు వచ్చేనెలలో జొన్నల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వైకాపా పాలనలో ప్రజాపంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారగా కార్డుదారులకు బియ్యం ఒక్కటే పంపిణీ చేశారు. చక్కెర, కందిపప్పు కోటాకు నెలల తరబడి మంగళం పాడారు. కూటమి ప్రభుత్వం బియ్యం, చక్కెర, కందిపప్పుతోపాటు ఇతర సరకులను పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. బియ్యం స్థానంలో కార్డుకు 1-3 కిలోల చొప్పున జొన్నలు అందజేయనున్నట్లు సమాచారం.

అక్టోబరులో పంపిణీ ఇలా..

అక్టోబరులో రేషన్ పంపిణీ 86.75 శాతంగా నమోదైంది. పంపిణీ గడువు ఈ నెల 17వ తేదీతో ముగిసినప్పటికీ, మరోరోజు గడువు పొడిగించి 18వ తేదీ వరకు పంపిణీ చేశారు. జిల్లాలో మొత్తం 6,00,307 కార్డుదారులు ఉండగా 5,20,800 కార్డుదారులకు నిత్యావసర సరకులు అందాయి. ఈ నెలలో కందిపప్పు కొరత కారణంగా కొంతమేర మాత్రమే పంపిణీ జరిగిందని, నవంబరు నుంచి పూర్తిస్థాయిలో పంపిణీ చేస్తామని జిల్లా సరఫరాల అధికారి శేషాచలం రాజు తెలిపారు. ఆ మేరకు గోదాములకు కందిపప్పు చేరనుందని, ఇప్పటికే డీలర్ల చేత డీడీలు కట్టిస్తున్నామన్నారు. వంట నూనెను రిటైల్ దుకాణాల్లో రాయితీపై అందిస్తున్నామని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాడు-నేడు పనులకు చెదలు



అచ్చుకట్ల పాఠశాలలో అలంకారప్రాయంగా నీటి పథకం

మూలకు చేరిన నీటి శుద్ధి యంత్రం

☛ విరిగిన తలుపులు

☛ నీరివ్వని శుద్ధి యంత్రాలు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో జిల్లాలోని పాఠశాలల్లో జరిగిన నాడు-నేడు పనుల్లో నాణ్యత నేతిబీర చందంగా కనిపిస్తోంది. ఒక్కో పాఠశాల ఆధునికీకరణకు రూ.లక్షల్లో ఖర్చు చేసినట్లు అధికారులు దస్త్రాల్లో నమోదు చేశారు. అయితే ఈ పనుల్లో చాలా వరకు నిధులు పక్కదారి పట్టినట్లు తెలుస్తోంది. పలుచోట్ల ఉపాధ్యాయులు నాణ్యత లేని పనులు చేశారు. మరికొన్నిచోట్ల శుద్ధి యంత్రాలను నేటికీ వినియోగంలోకి తీసుకురాలేదు. దాంతో విద్యార్థులు గుక్కెడు నీటికి అవస్థలు పడుతున్నారు.

జిల్లాలో నాడు-నేడు కింద మొదటి విడతలో 862 పాఠశాలల ఆధునికీకరణ చేయాలని తలచారు. ఇందులో భాగంగా 1628 పనులకుగాను రూ.163.95 కోట్ల నిధులు కేటాయించారు. ఇప్పటి వరకు రూ.156.59 కోట్లు చెల్లించారు. రెండో విడతలో నాడు-నేడు కింద రూ.396.49 కోట్లు కేటాయించగా రూ.165.64 కోట్లు విడుదల చేశారు. అయితే రెండో విడత పనులు చాలా చోట్ల నిధుల సమస్యతో అసంపూర్తిగా కనిపిస్తున్నాయి. దాంతో తరగతి గదులు పూర్తికాక విద్యార్థులు ఆరుబయట, చెట్ల కింద కూర్చొని విద్యాభ్యాసం చేస్తున్నారు.



బూదూరు పాఠశాలలో గదుల్లో తలుపులు ఇలా..

క్షేత్రస్థాయిలో ఇవిగో..

- దొరవారిసత్రం మండలంలోని బూదూరు ప్రాథమిక పాఠశాలలో మొదటి విడత నాడు-నేడు కింద రూ.15 లక్షల వరకు ఖర్చు చేశారు. ప్రస్తుతం ఇక్కడ చేసిన పనులన్నీ పాడయ్యాయి. తరగతి గదులకు ఏర్పాటు చేసిన కొయ్య సామగ్రి చెదలు పట్టి, ఊడిపోతోంది. కొయ్యసామగ్రికి రంధ్రాలు పడ్డాయి. శుద్ధి నీటి యంత్రం మూలకు చేరింది. కొన్ని తలుపులు ఊడిపోయాయి. మరి కొన్ని కనుమరుగయ్యాయి.



బూదూరు పాఠశాలలో ద్వారానికి చెదలు

- సూళ్లూరుపేట మండలంలోని అచ్చుకట్ల ప్రాథమిక పాఠశాలలోనూ నేటికీ నీటి పథకం వినియోగంలోకి రాలేదు. పాఠశాలలో తరగతి గదిపై నీటి నిల్వకు ట్యాంకు నిర్మించారు. లోపల శుద్ధి యంత్రం, మోటారు కూడా ఏర్పాటు చేశారు. అయితే నీటి వనరు లేదని వినియోగంలోకి తీసుకురాలేదు.
- దొరవారిసత్రం మండలంలోని నెలబల్లి పాఠశాలలోనూ నాడు-నేడు కింద పంపిణీ చేసిన వాటర్ ప్లాంట్ పనిచేయడం లేదు. ఇలా జిల్లాలోని పలు పాఠశాలల్లో ఈ పరిస్థితి నెలకొంది.

■ **తుప్పు పడుతున్నా పట్టించుకోక**

మొదటి, రెండో విడతల్లో పాఠశాలల్లో తాగునీటి పథకాలు, నీటి శుద్ధి యంత్రాలను ఏర్పాటు చేశారు. వాటిని పలుచోట్ల నేటికీ వినియోగంలోకి తేలేదు. మరికొన్నిచోట్ల ప్రభుత్వం పంపిణీ చేసిన నీటి శుద్ధి యంత్రాలను మూలన పడేసిన దాఖలాలున్నాయి. అసలు వాటి గురించి ఉపాధ్యాయులు పట్టించుకోవడం లేదు. దాంతో రూ.లక్షల విలువైన యంత్రాలు తుప్పు పట్టిపోతున్నాయి. ఈ విషయంలో సమగ్రశిక్ష అభియాన్, జిల్లా విద్యాశాఖ, ఉప విద్యాధికారులు, ఎంఈవోలు సైతం ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు.

ఏడింటికే మద్యం.. ఇదేమి చోద్యం



కూటమి ప్రభుత్వం తెచ్చిన నూతన మద్యం పాలసీని కొందరు తుంగలో తొక్కుతున్నారు. ఉదయం పది నుంచి రాత్రి పది గంటల వరకు మాత్రమే మద్యం విక్రయించాల్సి ఉండగా ఉదయం ఏడు గంటలకే దుకాణాలు తెరిచి విచ్చలవిడిగా అమ్ముతున్నారు. తిరుపతిలోని శ్రీహరిచంద్ర శ్మశానవాటిక సమీపంలోని మద్యం దుకాణం ఏడు గంటలకే తెరుస్తున్నారు. మందుబాబులు రోడ్డుపై వాహనాలు నిలిపివేసి వెళ్తుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది.

- తిరుపతి, ఈనాడు డిజిటల్

నాలుగు రోజులు.. రూ.50 కోట్ల మద్యం

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: జిల్లాలో 227 మద్యం రిటైల్ దుకాణాలను లాటరీ ద్వారా కేటాయించారు. నాలుగు రోజుల్లో 218 దుకాణదారులు తిరుపతి, గూడూరు డిపోల నుంచి సుమారు రూ.50 కోట్ల మద్యం కొనుగోలు చేశారు.

రాయల చెరువుకు జలకళ

శ్రీకృష్ణదేవరాయలు తవ్వించిన రాయలచెరువు జలకళ సంతరించుకుంది. చెరువు కింద సుమారు రెండువేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈనెల 14 నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు కొండల పైనుంచి వచ్చి చేరిన వర్షంనీటితో జలకళను సంతరించుకుంది. పూర్తిస్థాయిలో నిండాల్సి ఉందని, రాబోయే ఈశాన్య రుతు పవనాలకు నిండే ఆస్కారం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు సందర్శకుల రాకతో సందడి కనిపిస్తోంది. - ఈనాడు, తిరుపతి



ప్రమాదం కేసులో నిందితుడి పేరు మార్చివేత..

పాకాల ఎస్సై, హెచ్‌సీని సస్పెండ్ చేసిన ఎస్పీ



ఎస్ఐ మహేష్‌బాబు ◗ హెడ్ కానిస్టేబుల్ మొగిలీశ్వర్‌రెడ్డి

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదం కేసు నమోదు చేయకుండా అలసత్వం ప్రదర్శించి.. చివరకు నిందితుడి పేరు మార్చివేసిన ఎస్సై, హెడ్ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ ఎస్పీ సుబ్బరాయుడు శనివారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈనెల 6వ తేదీన పాకాల పోలీసు స్టేషన్ పరిధిలోని ఈపాలగుట్టపల్లె వద్ద కారు - ద్విచక్ర వాహన ప్రమాదం జరిగింది. ద్విచక్ర వాహనదారు తీవ్ర గాయాలకు గురికావడంతో ఘటనపై వారు ఫిర్యాదు చేయగా ఎస్సై మహేష్‌బాబు, రైటర్‌గా పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ మొగిలీశ్వర్‌రెడ్డి కేసు నమోదుకు సానుకూలత చూపలేదు. బాధితులు పలుమార్లు స్టేషన్ చుట్టూ తిరిగారు. చివరకు ఉన్నతాధికారుల దృష్టికెళ్లడంతో పదిరోజుల తరువాత కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ పేరు కాకుండా మరొకరి పేరు చేర్చారు. దీనిపై బాధితులు ఎస్పీ సుబ్బరాయుడుని కలిసి ఫిర్యాదు చేశారు. ఆయన ప్రాథమిక విచారణకు ఆదేశించడంతో వాస్తవాలు వెలుగుచూశాయి. ఘటనకు కారణమైన డ్రైవర్ వివరాలు దాయడం, మరొకరి పేరు చేర్చడం, విధుల్లో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ చట్టాన్ని దుర్వినియోగం చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలడంతో ఎస్సై మహేష్‌బాబు, హెచ్‌సీ మొగిలీశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసులు చట్టప్రకారం చిత్తశుద్ధి.. నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని చెప్పారు. అవినీతి, అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు.

గూడూరు, వెంకటగిరి, న్యూస్‌టుడే: ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ఇవి ఏర్పాటు కానున్నాయి. తాజాగా ఇందుకు అవసరమైన పాలసీని ప్రభుత్వం తీసుకొచ్చింది. ఇటు పారిశ్రామిక అభివృద్ధి

కొత్త పాలసీ.. పరిశ్రమలకు బాటేసి

- జిల్లాకు మరో ఐదు ఇండస్ట్రియల్ పార్కులు
- నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు

తోపాటు యువతకు ఉపాధి దక్కనుంది.

జిల్లాలో సత్యవేడు నియోజకవర్గంలో ఓ ప్రైవేటు పారిశ్రామిక పార్కు ఉంది. ఇదే తరహాలో గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి, శ్రీకాళహస్తి, చంద్రగిరి నియోజకవర్గాల్లో ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు కానున్నాయి. ఇందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన పాలసీ మేరకు 10 ఎకరాల నుంచి వెయ్యి ఎకరాలకు పైగా భూములు తీసుకుని పార్కు ఏర్పాటు చేసుకునే వీలు కల్పించారు. ఇందుకు ముందుకొచ్చే వారికి ప్రోత్సాహం ఇవ్వడానికి కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది.

పీపీపీపీ విధానంతో..

పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్టనర్ షిప్(పీపీపీపీ) విధానంలో ప్రభుత్వం పెద్దఎత్తున వసతులు సమకూర్చడం సమస్యగా మారిన నేపథ్యంలో ప్రైవేటు సంస్థలు, వ్యక్తులు ముందుకొస్తే భూమి అప్పగిస్తోంది. సామూహికంగా రైతులు ముందుకొచ్చినా వారిని భాగస్వామ్యం చేస్తారు. ఇలా చిన్న తరహా రైతులు పారిశ్రామికవేత్తలుగా ఎదిగే అవకాశాలున్నాయి.



నాయుడుపేట పారిశ్రామిక పార్కు

ఎగుమతులే లక్ష్యంగా..

జిల్లాలో పెద్ద ఎత్తున భూములు అందుబాటులో ఉన్నాయి. ఇటు గూడూరు నియోజకవర్గంలో ఇప్పటికే 20 వేల ఎకరాలు ఏపీఐఐసీ సేకరించింది. సూళ్లూరుపేట నియోజకవర్గంలోని శిరసనంబేడు, చెంబేడు, నందిమాల, అర్ధమాల ప్రాంతాల్లో మూడు వేల ఎకరాలు గతంలో గుర్తించారు. శ్రీకాళహస్తిలో ఇప్పటికే 26 వేల ఎకరాలు నోడ్ పరిధిలో ఉండగా ఇంకా మిగులు భూములున్నాయి. వెంకటగిరి నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు పెద్దఎత్తున అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఎగుమతులు చేపట్టవచ్చన్నది ప్రభుత్వం ఉద్దేశంగా ఉంది.

తితిదే ఉద్యోగుల సహకార బ్యాంకు ఎన్నిక

- 43 మంది నుంచి 59 నామపత్రాలు దాఖలు

తిరుపతి (బైరాగిపట్టెడ): తితిదే ఉద్యోగుల సహకార బ్యాంకు ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఏడు డైరెక్టర్ల పదవుల కోసం మొత్తం 59 నామపత్రాలను 43 మంది దాఖలు చేశారు. దేవస్థానం పరిపాలనా భవనం ఆవరణలోని సొసైటీ భవనంలో సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎన్.ఉమాపతి అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించారు. 20వ తేదీన పరిశీలన, 21వ తేదీన ఉపసంహరణ ప్రక్రియ జరగనుంది. 28వ తేదీన పోలింగ్ ప్రక్రియ పూర్తి కానుంది. మొత్తం 6,349 మంది ఓటర్లు ఏడుగురు డైరెక్టర్లను ఎన్నుకోనున్నారు.

ఆటోను ఢీకొన్న లారీ

డ్రైవర్ దుర్మరణం.. ఏడుగురికి గాయాలు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై శనివారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందగా, ఏడుగురు గాయపడ్డారు. దొరవారిసత్రం నుంచి ఏడుగురు మహిళలు తడ మండలంలోని మాంబట్టు సెజ్‌లో పనిచేసేందుకు ఆటోలో బయలుదేరారు. నాదెండ్లవారికండ్రిగ వద్దకు వచ్చే సరికి వెనుక వస్తున్న లారీ అదుపు తప్పి ఢీకొంది. ఆటోతోపాటు అందులోని వారు చెల్లాచెదురుగా రహదారిపై పడ్డారు. ఆటో డ్రైవర్ మునిరాజా(32) మరోవైపు పడ్డారు. ఢీకొట్టిన లారీ వెంటనే మునిరాజాపై వెళ్లింది. దాంతో ఆయన అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మిగిలిన ఏడుగురు మహిళలకు గాయాలవడంతో వారిని సూళ్లూరుపేట ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఘటనాస్థలికి పోలీసులు చేరుకుని, వివరాలు సేకరించారు. క్షతగాత్రులను ఆర్డీవో కిరణ్మయి పరామర్శించారు.



క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఆర్డీవో కిరణ్మయి, సీఐ మురళీకృష్ణ

చెరువులోకి దూసుకెళ్లిన బస్సు

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



వాకాడు, న్యూస్‌టుడే: మండలంలోని వలమేడు గ్రామ సమీపంలోని చెరువులోకి వాకాడు డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు దూసుకెళ్లింది. అందులో ఉన్న ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. బస్సు శనివారం ఉదయం మల్లాం నుంచి చిన్నతోటకు వెళ్తుండగా.. బ్రేకులు ఫెయిల్ కావడంతో ఈ ఘటన జరిగింది.

రైలు పట్టాలపై యువకుడి ఆత్మహత్య



తేజేశ్వరరెడ్డి (పాత చిత్రం)

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: తిరుపతి నగరం పంట వీధికి చెందిన తేజేశ్వరరెడ్డి (35) ఓ ప్రైవేటు మెడికల్ సంస్థలో థెరపీ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. శనివారం చిత్తూరు వచ్చిన అతడు మెసానికల్ మైదానం సమీపంలో రైలు పట్టాలపైకి వెళ్లాడు. ఆ సమయంలో కోయంబత్తూరు-తిరుపతి ఇంటర్‌సిటీ రైలు వస్తుండగా పరుగెత్తి పట్టాలపై పడుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. లోకో పైలెట్ గుర్తించి అధికారులకు సమాచారం ఇవ్వగా జీఆర్‌పీఎఫ్ అధికారులు మృతదేహాన్ని పరిశీలించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియలేదు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెంబేడు కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

తొట్టంబేడు, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తి గోపాలవనం న్యాయస్థానం వెనుక భాగంలోని చెంబేడు కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం శనివారం గుర్తించారు. సీఐ వెంకటేశులు కథనం మేరకు. . కాలువలో మృతదేహం కొట్టుకొచ్చినట్లు సమాచారం అందడంతో పరిశీలించినట్లు తెలిపారు. మృతుని వయస్సు 35-40 ఏళ్లలోపు ఉండవచ్చన్నారు. శరీరంపై నల్లరంగు, తెలుపు రంగు పువ్వుల చొక్కా; నలుపు, తెలుపు గీతలు కలిగిన నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని ప్రాంతీయ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. స్థానిక సాలిపేట వీఆర్వో అనిల్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తిరుపతి

• తిరుపతి • చంద్రగిరి

జంక్ ఫుడ్‌తో వ్యాధుల ముప్పు



మాట్లాడుతున్న ఆహార భద్రతాధికారి

తిరుపతి (బైరాగిపట్టెడ): పేవ్‌మెంట్లలో విచ్చలవిడిగా వినియోగిస్తున్న రంగులు, ఇతర నిల్వ పదార్థాలతో అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, క్యాన్సర్లకు హేతువుగా మారుతున్నాయని ఆహార భద్రత ప్రమాణాల అధికారులు మద్దిలేటి, నర్మద అన్నారు. జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ ఆహార దినోత్సవ వారోత్సవాల సందర్భంగా శనివారం స్థానిక ప్రైవేటు పాఠశాలలో సదస్సు జరిగింది. జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షులు పి.రాజారెడ్డి మాట్లాడుతూ నాణ్యత లేని ఆహార పదార్థాలు విక్రయించే వారిపై ఫిర్యాదు చేయాలని కోరారు.

వరద పనులు పునఃప్రారంభం

తిరుపతి(జీవకోన): కరకంబాడి మార్గం లో అర్ధాంతరంగా నిలిచిపోయిన వరదకాలువ పనులు పునఃప్రారంభమయ్యాయి. 'ఈనాడు'లో ఈనెల 15న 'వరద కాలువ పనులు పూర్తయ్యేనా' శీర్షికన కథనం ప్రచురితమైంది. నగరపాలక అధికారుల ఆదేశాలతో గుత్తేదారు వాటిని చేపట్టారు.

మేమున్నాం... మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
తిరుపతి : 80080 20003
చంద్రగిరి : 80085 74561
పాకాల : 80085 74563

చంద్రగిరి గ్రామీణ, న్యూస్‌టుడే

సమస్య: చిన్నరామాపురం పంచాయతీ భీమవరం గ్రామ హరిజనవాడలో వీధి దీపాలు వెలగడం లేదు. గ్రామంలోని మురుగునీరు తాగునీటి బోరు పక్కన చేరి కలుషితం అవుతోంది. మురుగునీటిని భీమా నదిలోకి వదిలే విధంగా కాలువలు నిర్మించాలి. – చిన్నవెంకటయ్య, గ్రామస్థుడు

సమాధానం: వీధి దీపాల సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తాం. మురుగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. – రాజేష్, పంచాయతీ కార్యదర్శి

న్యూస్‌టుడే, యర్రావారిపాలెం

సమస్య: మండలంలోని నెరబైలు గ్రామ పంచాయతీ తిమ్మిరెడ్డివాండ్లపల్లెలో వీధి దీపాలు వెలగడంలేదు. ఇబ్బందులు తొలగించాలి. – గురవయ్య, స్థానికుడు

సమాధానం: సిబ్బందితో కొత్త దీపాలు ఏర్పాటు చేయిస్తాం. – శశిభూషణ్, పంచాయతీ కార్యదర్శి

న్యూస్‌టుడే, తిరుపతి (నగరపాలిక)

సమస్య: రైల్వేకాలనీ ఇంటి నంబరు 18-4-23 సమీపంలో యూడీఎస్ మ్యాన్‌హోల్ పది రోజుల నుంచి పొంగుతోంది. – కె.సూర్య ప్రకాష్‌రెడ్డి, రైల్వే కాలనీ

సమాధానం: మ్యాన్‌హోల్ సమస్యను పరిష్కరించేందుకు వెంటనే చర్యలు చేపడతాం. – యువ అన్వేష్, నగరపాలక వైద్యాధికారి

తిరుచ్చిపై శ్రీహరి విహారం



దేవేరులతో శ్రీహరి

చంద్రగిరి: శ్రీకళ్యాణ వెంకటేశ్వర స్వామి శనివారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేతంగా బంగారు తిరుచ్చిపై విహరిస్తూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పెరటాసి మాసం ఐదో శనివారం సందర్భంగా భక్తుల తాకిడి ఎక్కువగా ఉండటంతో మహా లఘు దర్శనం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం ఆర్జిత కల్యాణోత్సవం, సాయంత్రం తిరుచ్చి వాహన సేవ చేపట్టారు.

టెట్‌కు 1,318 మంది హాజరు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: తిరుపతి జిల్లా వ్యాప్తంగా శనివారం ఐదు కేంద్రాల్లో జరిగిన టెట్‌కు మొత్తం 1,318 మంది హాజరయ్యారు.

పర్యావరణం పరిరక్షిద్దాం



మొక్కనాటుతున్న రిజిస్ట్రార్ భూపతి నాయుడు తదితరులు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కంకణబద్ధులు కావాలని ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు పిలుపునిచ్చారు. శ్రీవేంకటేశ్వర విద్యాలయంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్, ఇంజినీరింగ్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులు మొక్కలు నాటారు. సీడీసీ డీన్ ఆచార్య చంద్రాయుడు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ దామోదరం, డా.హరికృష్ణ, డా.వివేక్, తాండవ కృష్ణ పాల్గొన్నారు.

ఎస్వీయూలో వేళాకోళం

ప్రారంభానికి నోచుకోని క్యాంటీన్లు, జిరాక్స్ కేంద్రాలు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఎస్వీయూలో పలు అంశాలకు సంబంధించిన టెండర్ల పీటముడి నెలకొని సమస్యలకు పరిష్కారం కరవైంది. వర్సిటీకి వివిధ పనుల నిమిత్తం వచ్చే సందర్శకులు, విద్యార్థులకు క్యాంటీన్, జిరాక్స్ వంటి సేవల కోసం ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోంది.



ప్రారంభానికి నోచుకోని క్యాంటీన్

నేతల బెదిరింపులు

స్క్రాప్ సంబంధిత టెండర్ ప్రక్రియలో కొందరు సంఘాల నేతలు, సంబంధిత విభాగం అధికారులపై దౌర్జన్యానికి దిగినట్లు ఆరోపణలున్నాయి. పాత కంప్యూటర్లు, ఇనుప సామగ్రి, చెక్క వస్తువులు, కొన్ని పాత కాగితాలకు సంబంధించి టెండర్లు ఇటీవల నిర్వహించారు. మొత్తం 13 మంది దరఖాస్తులు తీసుకోగా ఐదుగురు మాత్రమే పాల్గొన్నారు. అయితే మొత్తం స్క్రాప్‌నకు ఒకరు రూ.8.10 లక్షలకు టెండరు దాఖలు చేసినట్లు సమాచారం. అయితే వర్సిటీ అధికార యంత్రాంగం ఈ ధర తక్కువగా ఉందని, ఓపెన్ ఆక్షన్‌కు వెళ్లేందుకు యత్నించినట్లు వినికిడి. అయితే వర్సిటీలోని ఇద్దరు సంఘం నేతలు సంబంధిత అధికారి వద్దకు వెళ్లి బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. టెండరు తమవారికే దక్కాలని పైరవీలు చేస్తున్నట్లు చెబుతున్నారు.

పారిశుద్ధ్యం మెరుగుపడేనా?

పారిశుద్ధ్య కార్మికులకు సంబంధించిన టెండర్ ప్రక్రియ ఇటీవల ముగిసింది. రోజూ వందమంది కార్మికులు విధుల్లో పాల్గొనేలా టెండర్లు పిలిచారు. వర్సిటీలోని కళాశాలలు, వసతి గృహాలు, కార్యాలయాలు, రోడ్ల వెంబడి శుభ్రత పెంచేందుకు వారిని తీసుకోవాలని నిర్ణయించారు. దీనికనుగుణంగా టెండర్ ప్రక్రియ జరగాల్సి ఉందని చెబుతున్నారు.

అందుబాటులో క్యాంటీన్లు లేక

వర్సిటీలో రెండు క్యాంటీన్లకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ ఇటీవల ముగిసింది. అయితే ఇంతవరకు పూర్తిస్థాయిలో ప్రారంభించకపోవడంతో విద్యార్థులు, అధ్యాపకులు అవస్థలు పడుతున్నారు. టెండర్ ప్రక్రియ జరిగి నెలరోజులు కావస్తోంది. అన్నపూర్ణ క్యాంటీన్‌ను మూసివేసి ఇప్పటికి ఐదు మాసాలు కావస్తోంది. త్వరితగతిన వాటిని ప్రారంభించి నాణ్యమైన ఆహార పదార్థాలు అందేలా చూడాలని విద్యార్థులు కోరుతున్నారు.

● మరోవైపున వర్సిటీ పరిధిలో గతంలో నాలుగు జిరాక్స్ కేంద్రాలు ఉండగా అవి మూతబడ్డాయి. వెంటనే వాటికి సైతం టెండర్లు పిలిచి జిరాక్స్, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.

ప్రాంగణ ఎంపికల్లో రాణింపు



విద్యార్థులతో కళాశాల ఛైర్మన్ డీవీఎస్ చక్రవర్తి రెడ్డి

తిరుపతి (బైరాగిపట్టెడ): స్థానిక న్యూబాలాజీ కాలనీలోని ఎస్‌డీ హెచ్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలల్లో శనివారం జరిగిన ప్రాంగణ ఎంపికల్లో 178 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ ఉష ఒక ప్రకటనలో తెలిపారు. ఫస్ట్ సోర్స్, ఎంఎన్‌సీ సంస్థల ప్రతినిధులు నిర్వహించిన ఎంపికల్లో విద్యార్థులు రాణించడంపై కళాశాల ఛైర్మన్ డీవీఎస్ చక్రవర్తిరెడ్డి అభినందించారు.

ఎంపిక పత్రాల అందజేత

తిరుపతి (మంగళం): మంగళం సమీపంలోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన ప్రాంగణ ఎంపికలు జరిగాయని కళాశాల అకడమిక్ డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు సంస్థ హెచ్‌ఆర్ ప్రతినిధి శ్రీకాంత్ నియామక పత్రాలు అందజేశారు.

కార్పొరేటర్ ఇంటిపై కూలిన చెట్టు

తిరుపతి (నగరపాలిక): నగరపాలక పరిధిలోని 33వ కార్పొరేటర్ దూది కుమారి ఇంటిపై శనివారం తెల్లవారుజామునచెట్టు కూలి పైకప్పు ధ్వంసమైంది. నగరపాలక అధికారుల నుంచి సాయంత్రం వరకు స్పందన లేకపోవడంతో పలువురు కార్పొరేటర్లు కమిషనర్ ఎన్.మౌర్య, మేయర్ శిరీషకు ఫిర్యాదు చేయడంతో శానిటేషన్ సిబ్బంది రాత్రి కొమ్మలను తొలగించే ప్రయత్నం చేశారు.

కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం

తిరుపతి(నగరపాలిక): ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సఫాయి కార్మికులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సఫాయి కర్మచారి కమిషన్ ఛైర్మన్ ఎం.వెంకటేశన్ అన్నారు. కమిషనర్ ఎన్.మౌర్యతో కలిసి సఫాయి కర్మచారీల సమస్యలపై సమీక్ష నిర్వహించారు. కార్మికులకు క్రమం తప్పకుండా జీతాలు ఇవ్వడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ లబ్ధి అందించాలన్నారు. పూచికత్తు లేని రుణాలు, ఆరోగ్య పరీక్షలు కోసం చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, తుడా కార్యదర్శి వెంకట నారాయణ, మున్సిపల్ ఇంజినీర్ తులసి కుమార్, గోమతి, వైద్యాధికారి డా.యువ అన్వేష్ రెడ్డి, కార్యదర్శి రాధిక, మేనేజర్ హసీమ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దాడి

తిరుపతి (నేరవిభాగం): తిరుపతి గ్రామీణ మండలం వేదాంతపురానికి చెందిన చంద్రమౌళి శనివారం ద్విచక్ర వాహనంపై కపిలతీర్థం కూడలి వద్ద వెళ్తూ ట్రాఫిక్ నిబంధనలు విస్మరించారు. దీనిపై ట్రాఫిక్ కానిస్టేబుల్ సోమసుందరం ప్రశ్నించగా అతను దాడికి పాల్పడ్డారు. నిందితుడిపై తిరుచానూరు పోలీస్ స్టేషన్‌లో హత్యాయత్నం కేసు నమోదైంది.

కోర్టుకు చంద్రగిరి ఎమ్మెల్యే హాజరు

తిరుపతి(లీగల్): చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని శనివారం తిరుపతి కోర్టుకు హాజరయ్యారు. మొదటి అదనపు మున్సిఫ్ కోర్టులో దాఖలు చేసిన ఓ కేసులో ఆయన వాంగ్మూలాన్ని (స్వార్న్ స్టేట్‌మెంట్) కోర్టు నమోదు చేసింది.

బాలిక అదృశ్యం

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: కొర్లగుంట మారుతీనగర్‌కు చెందిన బాలిక (14) అదృశ్యమైనట్లు తూర్పు సీఐ శ్రీనివాసులు తెలిపారు. శనివారం సాయంత్రం ఆమె తండ్రి తూర్పు పోలీసులను ఆశ్రయించడంతో దర్యాప్తు చేస్తున్నారు. బాలిక సెల్‌ఫోన్ నుంచి వెళ్లిన కాల్స్ ఆధారంగా సికింద్రాబాద్ వెళ్లడానికి రైల్వే స్టేషన్‌కు చేరుకున్నట్లు సమాచారం.

ముగిసిన శిక్షణ తరగతులు

రామచంద్రాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశమందిరంలో రెండు రోజులపాటు నిర్వహించిన పంచాయతీల వార్డు సభ్యుల శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఎంపీడీవో ఇందిరా మాట్లాడుతూ పంచాయతీ పాలనపై ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: నగరంలో బాలాజీ కాలనీ, ప్రకాశంరోడ్డు, ఇందిరా నగర్, కుమ్మరతోపు, ఎల్ఐసీ రోడ్డు, నెహ్రూ నగర్, రిజర్వాయర్‌కాలనీ, పీపీచావడి, నరసింహతీర్థం, పరసాలవీధి, బొమ్మగుంట, టౌన్‌క్లబ్ ఏరియా, చిన్నబజారువీధి, కోర్టు పరిసర ప్రాంతాలు, కేవీలే ఔట్, పొల్లవీధి, ఐఎస్‌మహల్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ చంద్రశేఖర్‌రావు తెలిపారు.

రేపటి నుంచి రోగులకు ఉచిత భోజనం

చంద్రగిరి, న్యూస్‌టుడే: స్థానిక 50 పడకల సామాజిక ఆరోగ్యకేంద్రంలో రోగులకు సోమవారం నుంచి ఉచితంగా ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన వసతి కల్పించనున్నట్లు ఆసుపత్రి పర్యవేక్షకురాలు అరుణ తెలిపారు.

రుయాలో పనిభారం తగ్గించాలి

తిరుపతి (నగరం): రుయాలో ఉద్యోగులు తీవ్రమైన పనిభారంతో ఇబ్బందులు పడుతున్నారని, పని భారం తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని ఉద్యోగుల సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. శనివారం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

ఐఎంఏ ఎన్నికల ప్రకటన

తిరుపతి (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) తిరుపతి శాఖ ఎన్నికలు నవంబర్ 17న నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు టి.జనార్దన్, వెంకటరమణ ప్రకటించారు. స్థానిక రెడ్డి రెడ్డి కాలనీలోని ఎస్వీ డయాగ్నోస్టిక్ సెంటర్ వద్ద ఈ నెల 20 నుంచి నవంబర్ 4 వరకు నామినేషన్లు స్వీకరిస్తారని పేర్కొన్నారు. నవంబరు 17న ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించారు.

చెరువుకు నీరు చేరేలా..

పాకాల : దామల చెరువు-పాకాల సప్లై ఛానల్ ద్వారా ఆ నీరు మల్లబ్బిగారిపల్లి సమీపంలోని కుళ్లపురెడ్డి చెరువుకు చేరడం లేదు. తూము మరమ్మతుకు గురైనట్లు తెలియడంతో జడ్పీటీసీ సభ్యురాలు నంగా పద్మజారెడ్డి, అధికారులు శనివారం పరిశీలించారు. ఇనుప తలుపు విరిగిపోవడటంతో తక్షణమే మరమ్మతు చేపట్టాలని నిర్ణయించారు. కాలువలో పిచ్చిమొక్కలను తొలగించాలని సూచించారు. డీఈఈ రెడ్డిసురేష్, ఎంపీడీవో శశిరేఖ, పంచాయతీ కార్యదర్శి యుగంధర్ పాల్గొన్నారు.





విద్యానగర్ కూడలి వద్ద కూల్చివేసిన దుకాణం ● శనివారం రాత్రి వెలసిన రెండు దుకాణాలు

కూల్చివేత నాటకం.. కబ్జాకు సహకారం నిజం

తిరుపతి (నగరపాలిక) : ప్రభుత్వ భూములు, రహదారులు, చెరువుల కబ్జా పథకం ప్రకారం జరిగే తంతుగా ప్రస్తుతం తయారైంది. అందుకు నిదర్శనమే తిరుపతి - చంద్రగిరి రహదారిలోని విద్యానగర్ కూడలి సమీపంలోని వ్యవహారం. కూడలి నుంచి తాటితోపు వరకు జాతీయ రహదారి.. రూ.కోట్ల విలువైన తాత్కాలిక దుకాణాలు, శాశ్వత నిర్మాణాలతో నిండిపోయింది. జాతీయ రహదారికి కేటాయించిన విశాలమైన స్థలంలో శుక్రవారం తాత్కాలిక దుకాణాలు నిర్మిస్తుండటంతో స్థానికులు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అధికారులు అడ్డుకున్నారు. అధికార పార్టీ, గత ప్రభుత్వ నాయకుల పేర్లుచెప్పి తొలగింపునకు ససేమిరా అన్నారు. ఆక్రమణకు సంబంధించి శనివారం 'ఈనాడు'లో 'ఆక్రమణలకు అండ' అన్న శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన రెవెన్యూ సిబ్బంది ఉదయం షెడ్డును నామమాత్రంగా తొలగించారు. సాయంత్రానికి అదే స్థానంలో రెండు దుకాణాలు ఏర్పాటు చేసి తమ పంతం నెగ్గించుకున్నారు. ఎమ్మెల్యే పేరుతోపాటు కొందరు వైకాపా నేతల పేర్లు ప్రస్తావిస్తున్నారు.

అక్రమ నిర్మాణం తొలగింపు



తిరుపతి (జీవకోన): వెంకటరెడ్డినగర్ సమీపంలోని కొంకాచెన్నాయగుంట చెరువు పరిధిలో అక్రమ నిర్మాణాన్ని శనివారం తొలగించారు. సర్వే నంబరు 173/3లోని చెరువును ఆక్రమించుకుని కొందరు నిర్మాణాలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే స్పందించిన తిరుపతి అర్బన్ తహసీల్దార్ కె.పి.భాగ్యలక్ష్మి రెవెన్యూ అధికారులను, సిబ్బందిని పంపించి వాటిని కూల్చివేయించారు. త్వరలోనే చట్టపరమైన చర్యలు తీసుకుని, ఆక్రమణలన్నింటినీ తొలగిస్తామని తహసీల్దార్ తెలిపారు.

ఆర్టీసీ ఈడీకి సత్కారం

తిరుపతి (ఆర్టీసీ), న్యూస్‌టుడే: జిల్లా ప్రజారవాణాధికారి (డీపీటీవో)గా పనిచేస్తూ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ ఇంజినీరింగ్)గా పదోన్నతి పొంది బదిలీ అయిన చెంగల్ రెడ్డిను పలువురు ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. స్థానిక డీపీటీవో కార్యాలయంలో శనివారం అభినందన సభ నిర్వహించారు. ఇన్‌ఛార్జి డీపీటీవో జగదీష్, జిల్లా డిప్యూటీ సీటీఎం భాస్కర్, డిప్యూటీ సీఎంఈ నరసింహులు, పీవో షాహజాద్, కె.చెన్నకేశవరావు పాల్గొన్నారు.



చెంగల్ రెడ్డిని సత్కరించిన ఉద్యోగులు





వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు ● బహుమతులు అందుకున్న విద్యార్థులు వి.జీవితేష్ సూర్య, ఇ.చాందిని, ఎస్.హర్షిణిలతో జీఎస్ఆర్ మ్యాగ్నెట్ స్కూల్ కరస్పాండెంట్ గోల్కొండ సత్యనారాయణ, ఉపాధ్యాయులు

వ్యాసరచన పోటీలతో సృజనా వికాసం

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచేందుకు వక్తృత్వ పోటీలు దోహదపడతాయని జీఎస్ఆర్ మ్యాగ్నెట్ స్కూల్ కరస్పాండెంట్ గోల్కొండ సత్యనారాయణ అన్నారు. శనివారం స్థానిక రాయల్ చెరువు రోడ్డులోని ఆ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 8, 9, 10 తరగతి విద్యార్థులకు 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వి.జీవితేష్ సూర్య, ఇ.చాందిని, ఎస్.హర్షిణి విజేతలుగా నిలిచారు. గెలుపొందిన విద్యార్థులకు 'ఈనాడు' నుంచి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు.

– న్యూస్‌టుడే, తిరుపతి(బైరాగిపట్టెడ)



ప్రారంభానికి నోచుకోని ఆర్వో ప్లాంట్లు



యర్రావారిపాలెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని వివిధ పంచాయతీల్లో నిర్మించిన ఆర్వో ప్లాంట్లు అలంకారప్రాయంగా మారాయి. తుడా నిధులతో ఒక్కో ప్లాంట్‌ను రూ.7 లక్షల వ్యయంతో నిర్మించారు. కమల్ల పంచాయతీలోని కొత్తపల్లె, పచ్చారువాండ్లపల్లెలో భవనాలను నిర్మించారు. ఉదయమాణిక్యం, బోడేవాండ్లపల్లిలో పనులు పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. ఈ విషయమై ఈవోపీఆర్డీ మాలతిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా కమల్ల పంచాయతీ, పచ్చారువాండ్లపల్లెలో యంత్రాలను ఏర్పాటుచేసిన తర్వాత అన్నింటినీ ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని వివరించారు.

రాష్ట్ర జూడో పోటీలకు జిల్లా జట్లు

తిరుపతి(క్రీడలు): స్కూల్‌గేమ్స్ అండర్- 17 రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా బాలబాలికల జట్లు ఎంపికైనట్లు స్కూల్ గేమ్స్ సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎస్.బాబు పేర్కొన్నారు. ఈనెల 20, 21వ తేదీల్లో శ్రీకాళహస్తి వేదికగా జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలో జిల్లా జట్లు పాల్గొంటాయని వివరించారు. ఈ సందర్భంగా జట్టులోని క్రీడాకారులకు అరవింద్ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఆదినారాయణరావు, ప్రవాసభారతీయుడు శ్యామ్ సుందర్ సహకారంతో అందజేసిన టీషర్టులను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీవో) సయ్యద్ సాహెబ్ చేతుల మీదుగా ప్రదానం చేశారు.

● **బాలికలు:** కె.భవ్య, పి.ఉమామహేశ్వరి, టి.లలిత, ఎ.దిల్లీరాణి, బి.ఉషశ్రీ, పి.హేమ వర్షిణి, మానస, పి.వర్ష, యస్వంతి.

● **బాలురు:** జి.ప్రేమ్‌కుమార్, వై.జె.భరత్, భానుప్రకాష్, బి.ఉపేంద్ర, వై.జె.అశోక్, ఆర్.మదన్, ఎల్.రామ్‌చరణ్, పురుషోత్తం, ఎస్.భయవేష్.

కాంగ్రెస్ డిమాండ్లు అమలు చేయాలి

తిరుపతి(గాంధీరోడ్డు): కాంగ్రెస్ సూపర్ సిక్స్ డిమాండ్లను దీపావళిలోపు అమలు చేయాలని కేంద్ర మాజీమంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. కరపత్రం తితిదే ఈవోకు చేరేలా ఉద్యోగులకు పంపిణీ చేస్తూ తితిదే పరిపాలన వద్ద నిరసన వ్యక్తం చేశారు. తితిదేకు పేరుప్రఖ్యాతలు తీసుకొస్తున్న వేలాదిమంది ఉద్యోగులకు ఆశ్రయం లేదని, ప్రధాన అర్చకులు, అర్చకులకు, శాశ్వత ఉద్యోగులకు అలిపిరి వద్ద ఐదు సెంట్ల చొప్పున ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్విమ్స్‌లో నిరుపేదలకు ఉచితంగా వైద్యం అందించాలని విజ్ఞప్తి చేశారు. గోపిగౌడ్, వెంకటేష్, రవి పాల్గొన్నారు.

హెచ్చరిక నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయుట ఏమనగా నా క్లయింట్ అయిన **రామిశెట్టి వివేకానంద తండ్రి వెంకయ్య, ముత్యాలరెడ్డిపల్లి, తిరుపతి అర్బన్, తిరుపతి-2, యల్.పి.నగర్, (పద్మావతినగర్) డోరు నెం. 15-49/3, చిత్తూరు జిల్లా** అను వారి సంజాయిషీ మేరకు నా క్లయింట్ యొక్క **భార్య శింగరాజు జ్యోతి అను వారు తే. 24–04–2010**దిన **తిరుపతి అర్బన్ మండలం, తిరుపతి టౌన్, రాయలచెరువు రోడ్డు, తుడా ప్లాట్స్ వెనుక శ్రీ నగర్ కాలనీ, కిరణ్ అపార్ట్‌మెంట్స్, ప్లాట్** నెం. **6**, డోరు నెం. 8-126 ఇంటిలో నివాసం ఉండు **యన్.ధనుంజయరెడ్డి గారి భార్య యన్.సునీత** మరియు సదరు ఇంటిలో ఉండు **యన్.నరసింహారెడ్డి** గారి కుమారుడు **యన్.ధనుంజయరెడ్డిలు** కలిసి వ్రాసి ఇచ్చిన స్థిర విక్రయపత్రం నెం. 2057/2010 రూ. 10,13,500/–లకు **(అక్షరములా పది లక్షల పదమూడు వేల అయిదు వందల రూపాయలకు)** విక్రయించడమైనది. సదరు విక్రయపత్రం నెం. 2057/2010 ద్వారా కొనుగోలు చేయడమైనది. సదరు విక్రయపత్రమును నా క్లయింట్ భార్య అయిన **శింగరాజు జ్యోతి హౌస్ లోను నిమిత్తం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కొర్లగుంట బ్రాంచి, తిరుపతి** నందు తనఖా పెట్టి ఇల్లు నిర్మించడం జరిగినది. నా క్లయింట్ భార్య అయిన **శింగరాజు జ్యోతి** అనారోగ్య నిమిత్తం తే. 06–07–2024దిన చనిపోవడం జరిగినది. సదరు ఆస్తికి సంబంధించి ఇతరులు ఎవరైనా లావాదేవీలు జరిపిన యెడల చట్టరీత్యా బాధ్యులు అగుదురు. ఇంతేకాకుండా నా క్లయింట్ అయిన **రామిశెట్టి వివేకానంద** సదరు తనఖాకు సంబంధించి విడతల వారీగా బ్యాంకు వారికి మొత్తం చెల్లించుచున్నారు. ఇంతేకాకుండా సదరు ఆస్తికి సంబంధించి నా క్లయింట్ **రామిశెట్టి వివేకానంద మరియు నా క్లయింట్ కుమారుడు రామిశెట్టి వెంకటరవి తేజాలు మాత్రమే వారసులుగా వున్నారు.** కావున ఈ హెచ్చరిక నోటీసు ద్వారా తెలియజేయడ మేమనగా నా క్లయింట్‌కు తెలియకుండా ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవరైనా ఎటువంటి లావాదేవీలు జరిపిన యెడల నా క్లయింట్‌కు బద్ధకించదు. మరియు నా క్లయింట్ తీసుకొనబోవు సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యులు కాగలరు.

షెడ్యూలు


చిత్తూరు జిల్లా, శ్రీ బాలాజి రిజిస్ట్రేషన్ జిల్లా తిరుపతి సబ్-డి, తిరుపతి అర్బన్ మండలం, తిరుపతి గ్రామ లెక్క దాఖలా, **తిరుపతి మజరా, ముత్యాలరెడ్డి పల్లి పంచాయతీ 16**వ వార్డుకు చేరిన మునిరెడ్డినగర్ రెసిడెన్షియల్ ఏరియాలో సర్వే నెం. **721**రులో గల జాగాకు చెక్కు బంది వివరములు. **తూర్పు :** రోడ్డు, **దక్షిణం :** ఎమ్.నిర్మల విక్రయించిన జాగా, **పడమర :** సి.ఆర్.యస్.పిళ్ళైగారి రోడ్డు, 16-17 ఇల్లు, **ఉత్తరం :** రాజేందర్‌శెట్టి గారి డోరు నెం. 16-10 గల ఇల్లు, ఆ నాలుగు హద్దులు మధ్యన గల తూర్పు పడమర 60కు మీ 18.300ర్లు, **ఉత్తరం, దక్షిణం :** అడుగులు 40కు మీ 12.00ర్లు, మొత్తం చ.అ. 2400లు లేక 266.66 చ.గ.లు గల జాగా పూరా.

బందా శ్రీనివాసులు, బి.ఎ., యల్.యల్.బి.,
అడ్వకేట్, ఫత్తేఖాన్‌పేట, నెల్లూరు, సెల్ : 95508 19473

దీపావళి కానుకగా ఉచిత గ్యాస్

తిరుపతి (నగరం): కూటమి నేతల హామీల్లో భాగంగా దీపావళి నాటికి అర్హులైన మహిళలకు ఉచితంగా గ్యాస్ పంపిణీ చేయనున్నట్లు తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడు నరసింహ యాదవ్ తెలిపారు. శనివారం నగరంలోని కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



కనుమ రహదారిలోని మలుపును పరిశీలిస్తున్న అధికారులు

చంద్రగిరి గ్రామీణ, న్యూస్‌టుడే: చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని భాకరాపేట కనుమ రహదారిని అధికారులతో కలిసి ఇటీవల పరిశీలించి ప్రమాదాలు జరగకుండా చొరవ తీసుకోవాలని సూచించారు. దీనిపై ప్రణాళిక తయారీకి కనుమ రహదారిలోని ప్రధాన మలుపులను అధికారులు శనివారం పరిశీలించారు. జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టేలోగా ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సీఐ సుబ్బరామిరెడ్డి, తిరుపతి ఎంవీఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

చంద్రగిరి, న్యూస్‌టుడే: చంద్రగిరి కొత్తపేట బ్రాహ్మణవీధికి చెందిన ఎన్.మునస్వామి ద్విచక్ర వాహనాన్ని శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. పోలీసులు కేసు విచారిస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం


తిరుపతి (గ్రామీణ): సి.మల్లవరం ఎస్సీ కాలనీలో విద్యుదాఘాతంతో ఓ ఇల్లు కాలిపోయిన ఘటన శనివారం ఉదయం చోటుచేసుకుంది. బాధితులు రామకృష్ణ, లక్ష్మీజానకి దంపతులు ఉదయం ఇంటి నుంచి వెళ్లారు. ఇంట్లో ఉన్న కుమారుడు హీటర్ ఆన్‌చేసి బయటికి వెళ్లిపోవడంతో మంటలు ఎగసిపడ్డాయి. స్థానికులు గుర్తించి మంటలు అదుపుచేశారు. అప్పటికే ఇంట్లోని సామగ్రి, దుస్తులు కాలిపోయాయి. సామగ్రి మొత్తం కాలిపోవడంతో రూ.10లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు.

ఇటుకల ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిలోని వకులమాత ఆలయం కూడలిలో ఇటుకలతో వస్తున్న ట్రాక్టర్‌ను లారీ వేగంగా ఢీకొంది. డ్రైవర్ తీవ్రగాయాలకు గురికాగా ట్రాక్టర్ నుజ్జయింది. గాయపడ్డ వ్యక్తి అల్లుడు జీవన్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనతో రెండు గంటల పాటు ట్రాఫిక్ అంతరాయం కలిగింది.

కోడి పందేలు ఆడుతున్న నలుగురి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: పైడిపల్లి గ్రామ పరిధిలోని మామిడి తోటలో కోడి పందేలు ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ చిన్న గోవిందు తెలిపారు. కోళ్లగుంట రాజు, కఠారి చలపతి, గాలి ఉమా మహేష్, పొగలూరి శ్రీహరిని అరెస్టు చేసి రూ.26,700, ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.



సన్నీ దేవోల్.. జాట్


సన్నీ దేవోల్

బాలీవుడ్ స్టార్ సన్నీ దేవోల్ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా చిత్రం తెరకెక్కుతోంది. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. రణదీప్ హుడా, సయామీ ఖేర్, రెజీనా తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకి 'జాట్' అనే పేరును ఖరారు చేశారు. శనివారం సన్నీ దేవోల్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్ర ఫస్ట్‌లుక్, మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. అందులో సన్నీ పెద్ద ఫ్యాన్ చేత్తో పట్టుకుని యాక్షన్ కోణంలో ఆసక్తికరంగా కనిపించారు. ఈ సినిమాని లార్జర్ దేన్ లైఫ్ యాక్షన్ డ్రామాగా భారీ హంగులతో ముస్తాబు చేస్తున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. దీని చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, ఛాయాగ్రహణం: రిషి పంజాబీ.



మున్నాభాయ్ 3 సన్నాహాలు

మరిన్ని విశేషాలు https://epaper.eenadu.net లో

ఈనాడు సినిమా


కృతిశెట్టి


కీర్తి సురేశ్

కథానాయకుల నుంచి కొత్త కబురు వినిపించిందంటే చాలు.. ఆ తర్వాత సినీప్రియుల్లో మెదిలే తొలి ప్రశ్న 'మా హీరోతో జోడీ కట్టే నాయిక ఎవరన్న'దే. దీనికి చిత్ర బృందం నుంచి స్పష్టత వచ్చే లోపే బోలెడన్ని పేర్లు ప్రచారంలోకి వచ్చి ప్రేక్షకుల్ని ఊరించే ప్రయత్నం చేస్తుంటాయి. ప్రస్తుతం ఇలాగే కొందరు హీరోల కొత్త చిత్రాలకు సంబంధించి పలువురు నాయికల పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. అయితే ప్రచారంలోకి వచ్చిన జంటలన్నీ తెరపై మురిపించాలని నియమం లేదు.

ప్రచార ఊరింపేనా.. జంటగా మురిపించేనా!


కథానాయకుడు ఎన్టీఆర్ వరుస విజయాలతో జోరు మీదున్నారు. ప్రస్తుతం ఆయన చేతిలో 'వార్ 2'తో పాటు ప్రశాంత్‌నీల్ సినిమా ఒకటుంది. ఇప్పటికే లాంఛనంగా మొదలైన ఈ 'ఎన్టీఆర్‌నీల్' (వర్కింగ్ టైటిల్) చిత్రం వచ్చే నెల నుంచి రెగ్యులర్ చిత్రీకరణకు సిద్ధమవుతోంది. దీనికోసం తారక్ జనవరి నుంచి సెట్స్‌లో అడుగు పెట్టనున్నారు. అయితే ఇప్పటికీ చిత్ర బృందం ఇందులో కథానాయిక ఎవరన్నది స్పష్టత ఇవ్వలేదు. ఈ ప్రాజెక్ట్ కోసం మొదట్లో రష్మిక పేరు వినిపించినప్పటికీ ఇప్పుడు రుక్మిణి వసంత్‌ను పరిశీలనలో ఉంచినట్లు వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. నాని కథానాయకుడిగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. 'దసరా' విజయం తర్వాత వీళ్ల కాంబోలో వస్తున్న రెండో సినిమా ఇది. పాన్ ఇండియా స్థాయిలో ముస్తాబు కానున్న ఈ చిత్రం కోసం బాలీవుడ్ భామ శ్రద్ధా కపూర్‌ను సంప్రదించినట్లు తెలిసింది. యువ హీరో విష్వక్ సేన్ ప్రస్తుతం చేతి నిండా చిత్రాలతో క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు. ఇప్పుడాయన చేయనున్న కొత్త సినిమాల్లో 'జాతిరత్నాలు' ఫేమ్ కేవీ అనుదీప్ చిత్రం ఒకటి ఉంది. ఇప్పటికే అధికారికంగా ప్రకటించిన ఈ ప్రాజెక్ట్ త్వరలో చిత్రీకరణ ప్రారంభించుకోనుంది. ఈ నేపథ్యంలోనే ఇప్పుడిందులో నాయికగా కృతిశెట్టిని సంప్రదించినట్లు సమాచారం. ఇప్పటికే కథా చర్చలు పూర్తయ్యాయని.. కృతి సానుకూలంగా స్పందించిందని తెలిసింది.


రుక్మిణి · శ్రద్ధా కపూర్

కాంబో కుదిరిందా?

కథానాయకుడు వెంకటేశ్ ప్రస్తుతం అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటున్న ఈ సినిమా సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది. కానీ, దీని తర్వాత ఆయన చేయనున్న కొత్త చిత్ర మేదన్నది ఇంకా తేలలేదు. అయితే త్వరలోనే దీనిపై స్పష్టత రానున్నట్లు తెలుస్తోంది. 'అర్జున్ సురవరం'తో తెలుగు ప్రేక్షకుల్ని మెప్పించిన టి.ఎన్. సంతోశ్.. ఇప్పుడు వెంకీతో ఓ సినిమా చేసే ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం. కథానాయిక కీర్తి సురేశ్ ఇందులో కీలక పాత్ర పోషించనున్నట్లు వార్తలు ఊపందుకున్నాయి. ఈ ప్రాజెక్ట్‌ను నితిన్ సొంత నిర్మాణ సంస్థ శ్రేష్ఠ్ మూవీస్ నిర్మించే అవకాశమున్నట్లు ప్రచారం సాగుతోంది.

బజరంగ్‌బలితో బాజీరావ్ సింగమ్


రణ్‌వీర్ సింగ్

ఇతిహాసాల్లో గొప్పగా భావించే రామాయణానికి హీరోల యాక్షన్ కోణాన్ని జోడిస్తే ఎలా ఉంటుందో చూపించడానికి వస్తోంది 'సింగమ్ అగైన్'. బాలీవుడ్ కథానాయకుడు అజయ్ దేవగణ్ ప్రధాన పాత్రలో రోహిత్ శెట్టి తెరకెక్కిస్తున్న చిత్రమిది. రణ్‌వీర్ సింగ్, టైగర్ ష్రాఫ్, అక్షయ్ కుమార్, కరీనా కపూర్, దీపికా పదుకొణె కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'సింగమ్' ఫ్రాంఛైజీలో రూపొందుతున్న ఈ చిత్రంలో మరోసారి బాజీరావ్ సింగమ్‌గా సందడి చేయనున్నారు అజయ్. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, పోస్టర్లు సినిమాపై అంచనాల్ని పెంచాయి. తాజాగా ఇందులోని మొదటి పాటను విడుదల చేసింది చిత్రబృందం. 'జై బజరంగ్‌బలి..' అంటూ సాగుతున్న ఈ గీతంలో రాముడిలా అజయ్, హనుమాన్‌లా రణ్‌వీర్ పాత్రల్ని, వారి మధ్య ఉన్న అనుబంధాన్ని చూపించారు. హనుమాన్ చాలీసా నుంచి ప్రేరణ పొందిన ఈ ట్రాక్‌ను తమన్ కంపోజ్ చేశారు.


అజయ్

ప్రతినాయకుడిగా.. సహాయనటుడిగా విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు నటుడు అజయ్. ఇప్పుడాయన ముఖ్య పాత్రలో నటించిన చిత్రం 'పొట్టేల్'. యువ చంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాని సాహిత్ మోత్ఖూరి తెరకెక్కించారు. ఇది ఈ నెల 25న రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు అజయ్.

టిట్ల తర్వాత పటేల్ పాత్రతో ఆ మ్యాజిక్

★ "ఇది భిన్న కోణాలున్న కథ. పూర్తిగా 1980ల నాటి తెలంగాణ నేపథ్యంలో సాగుతుంది. ఓ చిన్న పాప చదువు కోసం చేసే పోరాటం ప్రధాన ఇతివృత్తంగా ఉంటుంది. అలాగే మూఢనమ్మకాలు.. వాటిని అడ్డుపెట్టుకుని బతికే మనుషులు.. మొండితనం.. గ్రామదేవతలు.. ఇలా చాలా కోణాల్ని ఈ కథలో స్పృశించారు దర్శకుడు సాహిత్".

★ "ఈ చిత్ర విషయంలో నాకు సవాల్‌గా అనిపించింది ఈ కథలోని సంస్కృతిని సహజంగా తెరపైకి తీసుకురావడమే. దీంట్లో నేను పటేల్‌గా ప్రతినాయక ఛాయ లున్న పాత్రలో కనిపిస్తా. కొన్ని సీన్స్‌లో చీరకట్టులో కనిపిస్తా. తెలంగాణలో సిగం (దేవుడు పూనడం) అని ఉంటుంది. అది వచ్చినప్పుడు ఆ వ్యక్తులు మాట్లాడే విధానం చాలా భిన్నంగా ఉంటుంది. ఈ పాత్ర చేసేటప్పుడు దాని మీద కొంత హోంవర్క్ చేశా. నేను చేసిన సినిమాల్లో 'విక్రమార్కుడు'లోని టిట్ల పాత్ర నాకెంతో పేరు తెచ్చి పెట్టింది. ఆ తర్వాత అలాంటి పాత్రలు కొన్ని ప్రయత్నించినా ఆ మ్యాజిక్ మళ్లీ కుదర్లేదు. కానీ, ఈ సినిమా ఆ లోటు తీరుస్తుందనిపిస్తోంది. నటుడిగా నాకెంతో ఆనందాన్నిచ్చిన పాత్రిది".

★ "ఈ చిత్రసీమలో 25 ఏళ్లుగా నటుడిగా ఉండగలగడం మామూలు విషయం కాదు. ఇన్నేళ్లు ఇక్కడ నిలకడగా కొనసాగడమే నా వరకు పెద్ద గిఫ్ట్. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా 250 సినిమాలు చేసే పరిస్థితి ఇప్పుడు లేదు. ఈ ఏడాది నాకు 'దేవర', 'మత్తువదలరా 2' లాంటి రెండు పెద్ద విజయాలు దక్కాయి. ఇటీవలే నేను 'సింగం అగైన్' చేశాను. 'పుష్ప 2', 'గరుడన్' తెలుగు రీమేక్ తదితర చిత్రాలు చేస్తున్నా".

బతుకే నటన

శివకుమార్ రామచంద్రవరపు, నితిన్ ప్రసన్న ప్రధాన పాత్రల్లో రిషికేశ్వర్ యోగి తెరకెక్కించిన చిత్రం 'నరుడి బ్రతుకు నటన'. టీజీ విశ్వప్రసాద్, సుకుమార్ బోరెడ్డి, సింధు రెడ్డి నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 25న రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో విడుదల ముందస్తు వేడుకను నిర్వహించారు. హీరో సుధీర్‌బాబు, దర్శకుడు శ్రీరామ్ ఆదిత్య తదితరులు అతిథులుగా హాజరయ్యారు. "ఈ సినిమాని అందరూ చూసి, ఆశీర్వదించాలని కోరుతున్నా" అన్నారు దర్శకుడు రిషికేశ్వర్.


సింధు, సుధీర్‌బాబు, విశ్వప్రసాద్, రిషికేశ్వర్, శివ

సైన్స్‌కు అతీంద్రియ శక్తులు కలిస్తే.. శంబాల


ఆది సాయికుమార్

ఆది సాయికుమార్ తన రాబోయే సినిమా కోసం సైంటిస్ట్ అవతారమెత్తారు. తాజాగా ఆయన ప్రధాన పాత్రలో 'శంబాల' అనే చిత్రంలో నటిస్తున్నారు. హారర్ థ్రిల్లర్ నేపథ్యంలో యుగంధర్ ముని దీన్ని తెరకెక్కిస్తున్నారు. ఆనంది కథానాయిక. శనివారం ఈ సినిమాను అధికారికంగా ప్రకటిస్తూ.. ఓ పోస్టర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. "అతీంద్రియ శక్తులకు సైన్స్ కలిస్తే.. ఆ నిజం కల్పితాల కంటే భయంకరంగా ఉంటుంది" అని వ్యాఖ్యల్ని జోడించింది. దీన్ని షైనింగ్ పిక్చర్స్ పతాకంపై రాజశేఖర్, మహిధర్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

ఓ యువకుడి జీవితం స్ఫూర్తితో!

రాకింగ్ రాకేశ్ ప్రధాన పాత్రలో నటిస్తూ.. స్వయంగా నిర్మించిన చిత్రం 'కేశవ చంద్ర రమావత్' (కేసీఆర్). గరుడవేగ అంజి తెరకెక్కించారు. అనన్య కృష్ణన్ కథానాయిక. ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. నటి అనసూయ, దర్శకుడు సాయి రాజేశ్ అతిథులుగా హాజరయ్యారు. హీరో రాకింగ్ రాకేశ్ మాట్లాడుతూ.. "బంజారా వర్గానికి చెందిన ఓ యువకుడి నిజ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ సినిమాని తెరకెక్కించాం" అన్నారు దర్శకుడు అంజి.


అనన్య, రాకేశ్

విద్యార్థులు క్రీడల్లో రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్తు

పుత్తూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రీడల్లో రాణిస్తేనే ఉజ్వల భవిత ఉంటుందని డీవైఈవో ప్రభాకర్‌రాజు పేర్కొన్నారు. పుత్తూరులోని బీఎస్ క్రికెట్ అకాడెమీలో శనివారం ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-17 బాలబాలికల క్రికెట్ జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు నవంబరులో గుంటూరులో జరిగే అండర్-17 క్రికెట్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు చిత్తూరులోని మెసానికల్ మైదానంలో శనివారం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ఆటగాళ్లు ఎంపిక పోటీలకు తరలి వచ్చారు. నిర్వాహకులు తుది జట్లు ఖరారు చేశారు. అండర్-17 జట్లు ఈ నెల 26 నుంచి 28 వరకు పశ్చిమగోదావరిలో, అండర్-14 జట్లు నవంబరు 3 నుంచి 5 వరకు నరసరావుపేటలో జరిగే పోటీల్లో తలపడనున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు..

చౌడేపల్లె, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఈ నెల 26, 27, 28 తేదీల్లో రాష్ట్రస్థాయి అండర్-17 బాలబాలికల కబడ్డీ పోటీలకు శనివారం స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి వసంత వాణి తెలిపారు.

చదరంగం, టెన్నిస్ జిల్లా జట్లు..

తిరుపతి(క్రీడలు): స్కూల్‌గేమ్స్ అండర్- 14, 17 చదరంగం, టెన్నిస్ బాలబాలికల జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు స్కూల్‌గేమ్స్ సమాఖ్య ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.బాబు తెలిపారు. తిరుపతిలోని శ్రీశ్రీనివాస క్రీడా సముదాయం వేదికగా శనివారం జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచినవారిని ఎంపిక చేశారు. త్వరలో కాకినాడ వేదికగా టెన్నిస్, కర్నూలు వేదికగా చదరంగం రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నట్లు ఆయన వివరించారు.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	129
రిటైల్	151
లేయర్	115
బ్రాయిలర్స్	219
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	249
లేయర్ మాంసం	195

ఇరకం దీవిలో తూము పరిశీలన


తూమును పరిశీలిస్తున్న ఇరిగేషన్, వ్యవసాయ శాఖల అధికారులు

తడ, న్యూస్‌టుడే: మండలంలోని ఇరకం దీవిలో పంట కాల్వ వద్ద దెబ్బతిన్న తూమును ఇరిగేషన్, వ్యవసాయ శాఖ అధికారులు శనివారం పరిశీలించారు. అల్పపీడనం కారణంగా రెండు రోజులుగా కురిసిన వర్షాలకు పొలాల్లోని నీరు వెళ్లేందుకు ఏర్పాటైన తూము కుంగిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్న విషయమై 'ఇరకం దీవిలో పంట మునక' శీర్షికన 'ఈనాడు'లో శుక్రవారం కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించారు. ఇరిగేషన్ ఏఈ కస్తూరయ్య, వ్యవసాయ శాఖ అధికారి కాంచన తదితరులు దీవిలో దెబ్బతిన్న తూమును పరిశీలించారు. ఉపాధి హామీ పథకం కింద కోతకు గురైన కట్ట పటిష్ఠం, తూము వద్ద ఇసుక బస్తాలు ఏర్పాటు చేసుకోవడం వంటి తాత్కాలిక పనులు చేసుకోవాలని ఇరిగేషన్ ఏఈ రైతులకు సూచించారు.

ఈనాడు కథనానికి స్పందన

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని పలువురు ప్రముఖులు శనివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారి మూలమూర్తిని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ ఛైర్మన్ వెంకటేశన్, సినీ నిర్మాత చెర్రీ, బద్వేలు ఎమ్మెల్యే సుధ, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి దర్శించుకున్నారు.


సినీ నిర్మాత చెర్రీ



కార్లతో అయ్యలగారి మార్గమై..

రూ.కోట్లతో నిర్మించిన మాస్టర్ ప్లాన్ రోడ్డు వాహనాల పార్కింగ్ కేంద్రంగా మారిపోయింది. తితిదే పరిపాలనా భవనాన్ని ఆనుకొని నిర్మించిన కందాడై రామానుజ అయ్యంగార్ మార్గంలో సగానికి పైగా ఆక్రమించి వాహనాలు ఆపేస్తుండటంతో ఆ మార్గంలో వెళ్లే వాహదారులు ఇబ్బందిపడుతున్నారు. గతంలో నగరపాలిక అధికారులు హెచ్చరించినా మార్పు రావడం లేదు. ఆక్రమణతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి పలుసార్లు ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఢీకొన్న దాఖలాలు ఉన్నాయి.

– ఈనాడు డిజిటల్, తిరుపతి

మద్యం దుకాణాన్ని అడ్డుకున్న ప్రజలు

ఏర్పేడు: మా పంచాయతీలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని ఆమందూరు ప్రజలు శనివారం అడ్డుకున్నారు. పంగూరుకు చెందిన వ్యక్తి మద్యం టెండర్ దక్కించుకోవడంతో ఆమందూరు పంచాయతీలో దుకాణం ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. స్థానికులు సంఘటన స్థలానికి చేరుకుని మద్యం అమ్మకాలను అడ్డుకున్నారు. ప్రధాన రహదారి ఆనుకుని నివాసాలు ఉండటంతో పాటు ఐఐటీ కొలువుదీరిన పంచాయతీలో మద్యం అమ్మకాలు చేపట్టడం తగదన్నారు. దుకాణంలోని మద్యం నిల్వలను వాహనంలో ఎక్కించి పంపించారు. మండల నేతలతో తాను సిండికేట్ కాకపోవడంతోనే కొందరు స్థానికులను రెచ్చగొట్టి అడ్డుకుంటున్నారని కిరణ్ వాపోయారు.


కారులో తరలిస్తున్న మద్యం

భక్తులకు ఇబ్బందులు రానీయవద్దు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయ దర్శనార్థం వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తనీయకుండా చర్యలు చేపట్టాలని ఈవో చంద్రశేఖర్ ఆజాద్ సూచించారు. ఈ విషయమై శనివారం ఆలయ పరిపాలన భవనంలోని సమావేశపు హాలులో ఆలయ అనువంశీక ప్రధాన దీక్షా గురుకుల్ డాక్టర్ స్వామినాథన్‌తో కలసి వైదిక కమిటీ, అధికారులతో సమావేశమయ్యారు. కార్తిక మాసం ప్రారంభమయ్యేలోగా ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. కార్తిక దీపాలు వెలిగించుకునేందుకు షెడ్డు, స్నానఘట్టాల అభివృద్ధి, ఉత్సవాల నిర్వహణ, కార్తిక దీపోత్సవాల ఏర్పాట్లు తదితరాలను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఆలయ వైదిక కమిటీ సభ్యులు, ఆలయ డిప్యూటీ ఈవో ఎన్.ఆర్.కృష్ణారెడ్డి, ఈఈ మురళీధర్‌రెడ్డి, ఏఈవోలు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

తిరుమలలో మతిస్థిమితం లేని యువకుడి హల్‌చల్

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్ చేసిన ఘటన శనివారం చోటుచేసుకుంది. నెల్లూరు జిల్లా ఉప్పలపాడు గ్రామానికి చెందిన యువకుడు (23) శ్రీవారి దర్శనార్థం కాలినడకన తిరుమలకు చేరుకున్నాడు. స్థానిక లేపాక్షీ ఎదురుగా ఉన్న డివైడర్‌పై కూర్చుని తనతోపాటు తెచ్చుకున్న చాకుతో చేతులకు గాయం చేసుకున్నాడు. రక్తం ధారగా కారడంతో సమీపంలోని భక్తులు తితిదే విజిలెన్స్ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న భద్రతా సిబ్బంది ఆసుపత్రికి తరలించేందుకు యత్నించగా వారితో వాగ్వాదానికి దిగాడు. కొంతసేపటికి సముదాయించి స్థానిక అశ్విని ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించారు. స్థానిక పోలీసులు పూర్తి స్థాయిలో వివరాలు ఆరాతీస్తున్నారు.

గోపాలాన్ని ఆక్రమించిన వైకాపా నాయకుడు

కేవీబీపురం, న్యూస్‌టుడే: పశువులకు కేటాయించిన పొలాన్ని ఓ వైకాపా నాయకుడు ఆక్రమించుకోవడంతో దానికి పోటీగా గ్రామంలోని వ్యక్తులు ఆ భూమిని ఆక్రమించిన సంఘటన శనివారం కేవీబీపురం మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు కథనం మేరకు.. మండలంలోని కర్లపూడి రెవెన్యూ పరిధిలో సుమారు 70 ఎకరాల స్థలాన్ని పశువులు మేతకు ప్రభుత్వం కేటాయించింది. స్థానిక వైకాపా నాయకుడు ఈ భూమిలో సుమారు ఐదు ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవడంతో స్థానికులు అడ్డుకున్నారు. ప్రస్తుతం మళ్లీ ఆ పొలంలో వైకాపా నాయకుడు సాగుకు సన్నద్ధం కావడంతో గ్రామస్థులు దానితో పాటు మిగిలిన గోపొలాన్ని ఆక్రమించే యత్నం చేశారు. తహసీల్దార్ మునిరత్నంను వివరణ కోరగా గోపొలానికి కేటాయించిన స్థలంలో ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.


కబ్జాను అడ్డుకునేందుకు వెళ్లిన కర్లపూడి ప్రజలు

తిరుపతి జిల్లా వార్తలు

కౌన్సిలర్‌పై కేసు

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని 9వ సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగి వెంకట సాయికుమార్‌పై దాడి చేసిన కౌన్సిలర్ నారి శేఖర్‌పై శుక్రవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుబ్బారావు తెలిపారు. శుక్రవారం సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగిపై కౌన్సిలర్ దూషిస్తూ దాడి చేసినట్లు బాధితుడు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు విచారణ చేపట్టి కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

నిందితులకు శిక్ష పడేలా చూడాలి

కోర్టు కానిస్టేబుళ్లతో ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: నిజాయతీగా పనిచేసిన వారిని రివార్డులతో ప్రోత్సహిస్తాం.. చట్టాన్ని అతిక్రమించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఎస్పీ సుబ్బరాయుడు హెచ్చరించారు. శనివారం స్థానిక పోలీస్ కవాతు మైదానంలో కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు మానిటరింగ్ వ్యవస్థ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పెండింగ్ కేసుల స్థితిగతులపై సమీక్షించారు. కేసు నమోదు. . నిందితుల అరెస్టు.. ఛార్జ్‌షీట్ దాఖలుతో సరిపెట్టకుండా నిందితులకు శిక్షపడేలా చూడాల్సిన బాధ్యత కోర్టు కానిస్టేబుళ్లపై ఉందన్నారు. ప్రతి కేసు నిరూపణకు చిత్తశుద్ధితో పనిచేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. నాన్ బెయిలబుల్ వారెంట్స్ ఎప్పటికప్పుడు అందజేయాలని, పోలీసుల వల్ల కేసులు కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయనే మాట రాకూడదని స్పష్టం చేశారు. అదనపు ఎస్పీ వెంకట్రావు, సీఐలు సుబ్రహ్మణ్యం, వెంకటప్ప పాల్గొన్నారు.


సమీక్షిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

మహిళ మెడలో బంగారు హారం చోరీ

ఏర్పేడు, న్యూస్‌టుడే: నిద్రిస్తున్న మహిళ మెడలో నుంచి బంగారు హారాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. ఈ ఘటన మండలంలోని గోవిందవరంలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఏర్పేడు సీఐ జయచంద్ర కథనం మేరకు.. బీసీ కాలనీకి చెందిన పుష్ప, భర్త రవితో కలసి వరండాలో నిద్రిస్తుండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ఇంట్లోకి చొరబడి ఆమె మెడలోని 40 గ్రాముల బంగారు హారాన్ని అపహరించుకుని వెళ్లారన్నారు. ఈ మేరకు బాధితులు శనివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అవివాహితులకు సువర్ణావకాశం

నేడు 'ఈనాడు' పెళ్లిపందిరి ఉచిత రిజిస్ట్రేషన్



విశ్వబ్రాహ్మణ కుల అవివాహితులకు 'ఈనాడు' పెళ్లి పందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. తిరుపతి, దేవేంద్ర థియేటర్ రోడ్డు, రైల్వే కాలనీలోని 'ఈనాడు' కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరిలో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివాహం కోసం ఎదురు చూస్తున్న సంబంధిత కుటుంబీకులు ఆదివారం ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 వరకు తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. వివరాలకు 91547 72006, 80080 02165 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు. వధూవరుల బయోడేటా, ఫొటోలు పైన తెలిపిన వాట్సాప్ నంబర్లకు పంపి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్‌ను ఫోన్‌లో యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చన్నారు.

పది రోజుల్లో వేతనాలు ఇవ్వకుంటే చర్యలు

తిరుపతి (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: పదిరోజుల్లో రుయా పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వకుంటే చర్యలు తప్పవని జాతీయ సఫాయి కర్మచారీ కమిషన్ ఛైర్మన్ వెంకటేశన్ హెచ్చరించారు. శనివారం రుయా ఆస్పత్రిలో పర్యటించి.. కార్మికులతో సమావేశమయ్యారు. మూడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, డ్యూటీలు సరిగా వేయడం లేదని వారు ఈ సందర్భంగా వాపోయారు. ఛైర్మన్ వెంటనే సంబంధిత కాంట్రాక్టు యాజమాన్యం ప్రతినిధులను పిలిపించి మాట్లాడారు. రుయా సూపరింటెండెంట్ రవిప్రభు, ఏడీ దాతేశ్వరి, ఏవో రమేష్, అసిస్టెంట్ ఆర్ఎంఓ హరికృష్ణ, కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ చిన్నలాలప్ప తదితరులు పాల్గొన్నారు. స్విమ్స్ ఆసుపత్రిని వెంకటేశన్ సందర్శించారు. సంచాలకులు ఆర్వీ కుమార్, ఎంఎస్ డా.రామ్ స్వాగతం పలికారు. కార్మికులు సమస్యలపై 011 -24648924 నంబరు ద్వారా తన కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.


వెంకటేశన్‌ను సన్మానిస్తున్న రుయా పారిశుద్ధ్య కార్మికులు

అభివృద్ధికి ఉత్తమ ప్రణాళికలు అవసరం

ఏర్పేడు, న్యూస్‌టుడే: జిల్లా అభివృద్ధికి అవసరమైన ఉత్తమ ప్రణాళికలు తయారీ చేయడంలో ఐఐటీ, ఐసర్‌తో పాటు ప్రముఖ విశ్వవిద్యాలయాల్లోని నిపుణుల అభిప్రాయాలు అమూల్యమైనవని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఏర్పేడులోని ఐఐటీ శాశ్వత ప్రాంగణంలో శనివారం పలువురు ప్రొఫెసర్ల బృందంతో సమావేశం నిర్వహించారు. స్వర్ణాంధ్ర-2047 తిరుపతి జిల్లా విజన్ డాక్యుమెంటరీ తయారీపై కార్యశాల గురించి వివరించారు. పలు అంశాలపై ఆచరణాత్మకంగా ప్రణాళికలో భాగస్వాములుగా మారాలని సూచించారు. కార్యక్రమంలో ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్.సత్యనారాయణ, జేసీ శుభం బన్సల్, ప్రొఫెసర్లు అరవింద్‌కుమార్ పాండే, రాహుల్ సిరోహి, చంద్రశేఖర్, హేమంత్ కుమార్, అనిల్‌కుమార్, రజని, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వైకాపా జిల్లా అధ్యక్షుడిగా భూమన

తిరుపతి (జీవకోన), న్యూస్‌టుడే: వైకాపా తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

24 నుంచి కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులతో సమావేశాలు

విజయవాడ (గవర్నర్‌పేట): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు జిల్లా, నగర కాంగ్రెస్ కమిటీలు, అనుబంధ విభాగాలతో ఏపీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల ఈ నెల 24 నుంచి ఏపీసీసీ కార్యాలయం ఆంధ్రరత్న భవన్‌లోసమావేశాలు నిర్వహించనున్నారని ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.ఎన్.రాజా ఓ ప్రకటనలో తెలిపారు. నవంబరు 7న అనంతపురం, శ్రీసత్యసాయి, తిరుపతి, చిత్తూరు జిల్లాల నాయకులతో షర్మిల సమావేశమవుతారు.

శ్రీకాళహస్తి

•శ్రీకాళహస్తి •సత్యవేడు

దోషపూజలు చేయించిన ఎక్సైజ్ శాఖ కమిషనర్

శ్రీకాళహస్తి: రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిశాంత్‌కుమార్ ముక్కంటి ఆలయంలో రాహు, కేతు సర్పదోష నివారణ పూజలను చేయించారు. ఈ సందర్భంగా అధికారులు ఆయనకు శనివారం ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో దోష పూజలు అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. దర్శనానంతరం ఆలయం తరపున తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ముక్కంటి సేవలో డీఆర్‌డీఏ పీడీ

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్నారు. దర్శనార్థం వచ్చిన ఆయనకు స్థానిక అధికారులు శనివారం ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు.

లక్ష్మీనరసింహస్వామికి విశేష పూజలు

నారాయణవనం, న్యూస్‌టుడే: మండలంలోని సింగిరి కోనలో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం మూలవర్లకు అభిషేకాలు చేసి నిత్యకైంకర్య పూజలు చేపట్టి ధూపదీప నైవేద్యాలను సమర్పించి స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు జలపాతంలో పవిత్ర స్నానాలాచరించి స్వామి అమ్మవార్లకు టెంకాయ హారతులు, నైవేద్యం సమర్పించి దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.



అలంకరణలో శ్రీలక్ష్మీనరసింహస్వామి

శ్రీసిటీ వేంకటేశ్వరాలయంలో ఘనంగా వార్షికోత్సవాలు

శ్రీసిటీ(వరదయ్యపాళెం), న్యూస్‌టుడే: శ్రీసిటీలోని శ్రీ ప్రసన్నవెంకటేశ్వరాలయంలో శనివారం శ్రీనివాస వార్షికోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపిన అనంతరం శ్రీసిటీ ఎండీ డా.రవీంద్రసన్నారెడ్డి ఆధ్వర్యంలో గణపతి, నవగ్రహ, మహాసుదర్శన హోమం, మహాపూర్ణాహుతి వంటి హోమయాగాదులను చేపట్టారు. అన్నదానం చేశారు. ఆలయ ప్రతినిధులు మధుసూదనరెడ్డి, మీటీఎస్ శాస్త్రి, పల్లేటి బాలాజీ ఉత్సవాలను పర్యవేక్షించారు.



హోమంలో పాల్గొన్న శ్రీసిటీ ఎండీ

తెదేపా కార్యకర్త మృతికి సంతాపం

ఏర్పేడు : మండలంలోని ఇసుకతాగేలికి చెందిన తెదేపా కార్యకర్త సుబ్రహ్మణ్యంరెడ్డి(65) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఇసుక తాగేలికి చేరుకుని సుబ్రహ్మణ్యంరెడ్డి మృతదేహానికి నివాళ్లు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పలువురు మండల నేతలు, కార్యకర్తలు నివాళ్లు అర్పించారు.



సుబ్రహ్మణ్యంరెడ్డి మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

మృతుల కుటుంబాలకు పరామర్శ .. నాగలాపురం, న్యూస్‌టుడే: పిచ్చాటూరు మండలం హనుమంతాపురంలో పిడుగుపాటుకు గురై మృతి చెందిన రామయ్య, సుబ్రహ్మణ్యంల మృత దేహాలకు వైకాపా నియోజకవర్గ బాధ్యుడు నూకతోటి రాజేష్ శనివారం నివాళులర్పించారు. మాజీ మండల సమన్వయకర్త హరిశ్చంద్రారెడ్డి, వైకాపా నేతలు ఉన్నారు.

పల్లెపాలనకు సిబ్బంది కరవాయే

- పంచాయతీ కార్యదర్శుల కొరత
- పడకేసిన పారిశుద్ధ్యం

కేవీబీపురం, నారాయణవనం, న్యూస్‌టుడే: సత్యవేడు నియోజకవర్గంలోని పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శుల కొరత గ్రామాభివృద్ధిని పట్టిపీడిస్తోంది. ఏ పంచాయతీ చూసుకున్నా సిబ్బంది లేక.. ప్రజా ప్రతినిధులు అభివృద్ధి పనులు చేపట్టలేక ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్నచందాన మారింది గ్రామాల్లో అభివృద్ధి పరిస్థితి. నియోజకవర్గంలో గతంలో కంటే ప్రస్తుతం పంచాయతీల పునర్విభజన తరువాత మరికొన్ని పంచాయతీలు కొత్తగా ఆవిర్భవించాయి. దీంతో పంచాయతీల సంఖ్య పెరిగి పంచాయతీ కార్యదర్శుల సంఖ్య ఘననీయంగా తగ్గింది.



కేవీబీపురం ఎంపీడీవో కార్యాలయం

మండలం	పంచాయతీలు	కార్యదర్శుల ఖాళీలు
కేవీబీపురం	39	26
బీఎన్‌కండ్రిగ	28	9
నారాయణవనం	19	6
వరదయ్యపాళెం	29	7
నాగలాపురం	19	5

అదనపు భారం

గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల కొరత తీవ్రంగా మారడంతో ఉన్న కార్యదర్శులతో పల్లెప్రగతిని ముందుకు తీసుకెళ్లేందుకు మండల అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో ఒక్కొక్క పంచాయతీ కార్యదర్శికి మూడు నుంచి ఐదు పంచాయతీల్లో బాధ్యతలు అప్పగించే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో కార్యదర్శులకు అదనపు భారం పడుతోంది. నియోజకవర్గంలో పంచాయతీ కార్యదర్శులుగా పనిచే సేందుకు సిబ్బంది చొరవ చూపకపోగా ఇక్కడి నుంచి పక్క మండలాలకు పారిపోయే స్థితి నెలకొంది.

బదిలీలు సరే.. భర్తీ ఏదీ

పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం ఇటీవల సాధారణ బదిలీలు కల్పించడంతో నియోజకవర్గం నుంచి పక్క నియోజకవర్గాలకు పెద్ద సంఖ్యలో బదిలీలపై వెళ్లారు. కాని ఖాళీ అయిన పంచాయతీలకు కొత్త కార్యదర్శులను ఎంపిక చేయడంలో మాత్రం జిల్లా అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. దీంతో పంచాయతీలలో అభివృద్ధి కుంటు పడటమే కాకుండా తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బదిలీ చేసిన అధికారులు వారి స్థానంలో మరొకరిని ఎందుకు నియమించడం లేదో అర్థం కావడం లేదని బాధిత ప్రజలు జిల్లా అధికారుల తీరును ఎండగడుతున్నారు.

పరిష్కారంకాని సమస్యలు

పంచాయతీ కార్యదర్శుల కొరత అధికంగా మారడంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. కొన్నిచోట్ల తాగునీటి సమస్యలున్నా ఎవరికి చెప్పుకోవాలో తెలియక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పారిశుద్ధ్యం క్షీణించడంతో సామాన్యులు రోగాల బారిన పడుతున్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు సామాన్యులు వేల రూపాయలను వెచ్చించి కార్పొరేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది.

త్వరలోనే పరిష్కారం

మండలంలో పంచాయతీ కార్యదర్శుల కొరత ఉన్నమాట వాస్తవమే. కార్యదర్శుల కొరతను ఇప్పటికే జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే సమస్యకు పరిష్కారం దొరికేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా అధికారులు హామీ ఇచ్చారు.

- రాధారాణి, ఇన్‌ఛార్జి ఎంపీడీవో, కేవీబీపురం

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

న్యూస్‌టుడే, రేణిగుంట

సమస్య: రేణిగుంట పంచాయతీలోని మంచినీళ్లగుంత వద్ద పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. ఇక్కడ చెత్తపేరుకు పోవడంతో మురుగునీరు చేరి దుర్వాసన వెదజల్లుతోంది. **- దామోదరం, స్థానికుడు**

సమాధానం: వెంటనే పరిశుభ్రత చర్యలు చేపడతాం. **- నాగేశం, సర్పంచి, రేణిగుంట**

న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

సమస్య: నందిహిల్స్ పరిసర ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదు. చుట్టూ చెట్లు, ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉండటంతో పాముల బెడద తీవ్రమైంది.

- అజయ్‌కుమార్, నందిహిల్స్ అసోసియేషన్ అధ్యక్షులు

సమాధానం: తమ పరిధిలోకి వస్తే సంబంధిత విద్యుత్తు శాఖ సిబ్బందిని పంపి వీధి దీపాలు వెలిగే విధంగా చర్యలు తీసుకుంటాం.

- గిరికుమార్, కమిషనర్, పురపాలక సంఘం

చౌకదుకాణం అక్రమాలపై విచారణ

కేవీబీపురం, న్యూస్‌టుడే: మండలంలోని ఆదరం చౌక దుకాణంపై వచ్చిన అవినీతి అక్రమాలపై శనివారం వీఆర్‌వో కృష్ణయ్య, రెవెన్యూ సిబ్బంది విచారణ చేపట్టారు. స్థానిక డీలరు నిరుపేదలకు అందించాల్సిన నిత్యావసర వస్తువులను పక్కదోవ పట్టిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారంటూ స్థానికులు కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తహసీల్దార్ మునిరత్నం నిత్యావసర వస్తువుల నిల్వలపైనా ఆరాతీశారు. అక్కడ అక్టోబర్ నెలకు సంబంధించిన తొమ్మిది క్వింటాల బియ్యం తక్కువగా ఉండటాన్ని అధికారులు గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు వీఆర్‌వో కృష్ణయ్య తెలిపారు.



వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న శ్రీవివేకానంద ఇంగ్లిషు మీడియం స్కూలు విద్యార్థులు



విజేతలతో పాఠశాల కరస్పాండెంట్ జితేంద్ర

సృజనకు పట్టం

'ఈనాడు' ఆధ్వర్యంలో శ్రీకాళహస్తిలోని శ్రీవివేకానంద ఇంగ్లిషు మీడియం స్కూలు పాఠశాలలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా 'ఇంటర్‌నెట్ వాడకం వల్ల లాభాలు-నష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అన్న అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులు పరమేశ్వర్, రియాజుద్దీన్, హాసినీలకు పాఠశాల కరస్పాండెంట్ జితేంద్ర బహుమతులతో పాటు ధృవీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటముని, మదన్, తులసీరాం తదితరులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**

గ్రామాభివృద్ధికి ప్రాధాన్యం



నాగలాపురం: రహదారి పనులకు భూమిపూజ చేస్తున్న అధికారులు, నేతలు

ఏర్పేడు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఎన్డీఏ ప్రభుత్వం పెద్దపీట వేసిందని తెదేపా అధికార ప్రతినిధి గురవారెడ్డి తెలిపారు. పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని మేర్లపాక పంచాయతీలో శనివారం సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి భూమిపూజ చేశారు. శ్రీకాళహస్తి మండలంలోని ముచ్చువోలులో పల్లెపండుగ వారోత్సవాలు నిర్వహించారు. కృష్ణవేణి, చంద్రారెడ్డి, రమణ, గుణ యాదవ్, సుధాకర్‌రెడ్డి, మురళి, నరసయ్య పాల్గొన్నారు. **నాగలాపురం :** పిచ్చాటూరు మండలంలోని ఇందిరానగర్‌లో రూ.5 లక్షల అంచనా వ్యయంతో సిమెంటు రహదారి పనులకు ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి శనివారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహమ్మద్ రఫీ, ఏపీఎం చంద్రకళ, ఏపీవో నాగభూషణమ్మ, కార్యదర్శి రాధిక, తెదేపా నేతలు రవి, వాసురెడ్డి, శ్రీనివాసులునాయుడు, బత్తారెడ్డి, రజనీకుమార్ తదితరులు పాల్గొన్నారు. **సత్యవేడు :** పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని చిన్నఈటిపాకం, పెద్దఈటిపాకం, కొల్లడం గ్రామాల్లో నూతనంగా నిర్మించనున్న సిమెంట్ రోడ్లకు తెదేపా నాయకులు భూమి పూజ చేశారు. నాయకులు, అధికారులు పాల్గొన్నారు. **బీఎన్‌కండ్రిగ :** గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెదేపా మండల అధ్యక్షులు ఎం.సుధాకర్‌నాయుడు అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.



ఏర్పేడు: రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న గురవారెడ్డి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రధానోపాధ్యాయిని బృందాదేవి

నిశబ్ద నడకతో చైతన్యం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: బానిసత్వం లేని ప్రపంచం సాధించడమే లక్ష్యంగా 'వాక్ ఫర్ ఫ్రీడమ్-నిశబ్ద నడక' చేపట్టినట్లు మన సంస్కృతి కళా సంస్థ ప్రధాన కార్యదర్శి రెడ్డప్ప అన్నారు. పట్టణంలోని శ్రీసరస్వతిబాయి పురపాలక సంఘ ఉన్నత పాఠశాల వద్ద శనివారం ఈ కార్యక్రమం చేపట్టారు. మహిళల రక్షణ, బానిసత్వం లేని జీవనం, మహిళలపై లైంగిక వేధింపుల నియంత్రణ అంశాలను ప్రస్తావిస్తూ మన సంస్కృతి కళా సంస్థ నిర్వహించిన కార్యక్రమాన్ని శ్రీసరస్వతిబాయి పురపాలక సంఘ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని బృందాదేవి ప్రారంభించారు. సంస్థ సభ్యులు దొరస్వామి, నాగమణి, గిరిధర్‌లు పాల్గొన్నారు.

నాగలాపురం, న్యూస్‌టుడే: ప్రాణమున్న వ్యక్తులను వస్తువులుగా మార్చవద్దంటూ నాగలాపురంలో గ్రామ జ్యోతి సొసైటీ, రూపీస్ సంస్థల ఆధ్వర్యంలో శనివారం నిశబ్దనడక కార్యక్రమాన్ని నిర్వహించారు. బానిసత్వ పోకడలను రూపుమార్చి వ్యక్తులందరినీ మనుషులుగానే సమాజంలో గుర్తింపు ఇవ్వాలంటూ నినాదాలు చేస్తూ నాగలాపురంలోని జూనియర్, డిగ్రీ కళాశాలలు, ఉన్నత పాఠశాలల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. రూపీస్ సంస్థ కార్యదర్శి అన్బు, సర్పంచి చిన్నదురైసుధ, ప్రిన్సిపల్స్ శ్రీలత, ప్రేమ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు కస్తూరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగమేళాకు స్పందన

వరదయ్యపాళెం : నిరుద్యోగులకు నైపుణ్యశిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వాశయమని తెదేపా మండల అధ్యక్షులు యుగంధర్‌రెడ్డి అన్నారు. ఇటీవల వరదయ్యపాళెం సచివాలయంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చేతుల మీదగా ప్రారంభించిన సృష్టిఫౌండేషన్ నైపుణ్య శిక్షణ కేంద్రంలో శనివారం జరిగిన మెగా ఉద్యోగమేళా కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా శ్రీసిటీలోని డైకిన్, బ్లూస్టార్, కొబెల్కో, త్రినాథ్, అమెజాన్ వంటి కంపెనీలలో ఉద్యోగావకాశాలకు నిర్వహించిన ఉద్యోగ మేళాకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో హాజరైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం సృష్టి ఫౌండేషన్‌చే నైపుణ్య శిక్షణ పొందిన వారికి ప్రభుత్వ ధ్రువీకరణపత్రాలను అందించారు. సర్పంచి జ్యోతి, పంచాయతీ కార్యదర్శి బసిరెడ్డి, తెదేపా మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి పన్నెం నిర్మల్, మునిభూషణమ్మ, భాజపా నాయకులు జానకీరామ్, సంస్థ ప్రతినిధి వెట్టి దొరబాబు పాల్గొన్నారు.

రోడ్డుపై నిలిచిన బస్సు

రేణిగుంట, న్యూస్‌టుడే: రేణిగుంట వంతెన ప్రారంభ ప్రదేశంలో శ్రీకాళహస్తికి వెళ్లే ఆర్టీసీ బస్సు మరమ్మతులకు గురికావడంతో నిలిచిపోయింది. శనివారం ప్రయాణికులను ఎక్కించుకుని తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి వెళుతున్న ఆర్టీసీ బస్సు సరిగ్గా వంతెన ప్రారంభ ప్రదేశంలో నిలిచిపోయింది. అది రోడ్డుకు అడ్డుగా నిలిచి పోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ఇటీవల కాలంలో రేణిగుంట పట్టణంలో వివిధ ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులు నిలిచిపోవడం ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది.



పర్యాటక హబ్‌గా అభివృద్ధి పరచండి.. శ్రీకాళహస్తి: ఆధ్యాత్మిక కేంద్రాలతో పాటు హస్తకళలకు ప్రాధాన్యం సంతరించుకున్న తిరుపతి జిల్లాను పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేయాలని తెదేపా రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి కోరారు. శనివారం కేంద్ర సూక్ష్మ చిన్న, భారీ పరిశ్రమల శాఖ మంత్రి జితిన్‌రామ్ మాంజీని దిల్లీలో కలిసి కొయ్యబొమ్మను బహూకరించారు.

మూడు టిప్పర్లు స్వాధీనం .. నాగలాపురం, న్యూస్‌టుడే: మండలంలోని సురుటుపల్లి వద్ద అనుమతులు లేకుండా గ్రావెల్‌ను తరలిస్తున్న మూడు టిప్పర్లను భూగర్భ గనుల శాఖాధికారులు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు ఎస్సై సునీల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇసుక, గ్రావెల్‌లను అనుమతులు లేకుండా టిప్పర్లలో తరలించవద్దని ఆయన సూచించారు. అక్రమంగా తమిళనాడుకు గ్రావెల్, ఇసుక తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పిడుగు పాట్లు.. శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఉరుములు, మెరుపులతో పాటు పిడుగు పాట్ల కారణంగా నష్టాలు తప్పలేదు. శనివారం వేకువజామున 4 గంటల నుంచి 5 గంటల వరకు అతి భారీ వర్షం కురిసింది. దీంతో పాటుగా భారీ ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు పడ్డాయి. పట్టణానికి సమీప ప్రాంతాల్లో పిడుగులు పడటం కారణంగా పలువురు నివాస గృహస్థుల టీవీలు, ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు, వైఫై రూటర్లు కాలిపోయాయి. దీంతో పట్టణ ప్రజలు మరింత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది.

ఓ బాలిక అదృశ్యం.. ఏర్పేడు, న్యూస్‌టుడే: రేణిగుంట మండలానికి చెందిన బాలిక(17) ఏర్పేడు మండలంలో అదృశ్యం కావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 14న నుంచి కనిపించక పోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ లభించక పోవడంతో పోలీసు స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జయచంద్ర తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు.. శ్రీకాళహస్తిగ్రామీణం(ఏర్పేడు) : రోడ్డు ప్రమాదంలో కర్ణాటక భక్తులు గాయపడిన ఘటన శ్రీకాళహస్తి మండలంలోని రాచగున్నేరి సమీపంలో రేణిగుంట-నాయుడుపేట ప్రధాన రహదారిపై శనివారం చోటు చేసుకుంది. గ్రామీణ పోలీసుల కథనం మేరకు.. కర్ణాటకలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు రెండు కారుల్లో శ్రీకాళహస్తీశ్వరాలయం దర్శనానికి వస్తుండగా వాహనాలను అధిగమించబోయే క్రమంలో అదుపు తప్పి ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ఇరువురు గాయ పడ్డారు.

అదుపుతప్పి ప్రైవేటు పాఠశాల బస్సు బోల్తా.. కేవీబీపురం, న్యూస్‌టుడే: మండలంలోని ఓ ప్రైవేటు బస్సు అదుపుతప్పి పొలాల్లో బోల్తా పడిన సంఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ప్రైవేటు పాఠశాల బస్సు పిల్లలను ఎక్కించుకుని కేవీబీపురం నుంచి ఆదవరం వైపు వెళ్తుండగా ఎస్ఎల్‌పురం సమీపంలోని మలుపు వద్ద అదుపుతప్పి పక్కనే ఉన్న పంట పొలాల్లో బోల్తా పడింది. పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి.

తప్పిన పెనుప్రమాదం.. ఏర్పేడు : ఎదురెదురుగా వస్తున్న రెండు బస్సులు అదుపు తప్పి ఢీ కొనడంతో నలుగురు గాయ పడిన ఘటన రేణిగుంట-నాయుడుపేట ప్రధాన రహదారిపై మేర్లపాక సమీపంలో చోటు చేసుకుంది. ఏర్పేడు సీఐ జయచంద్ర కథనం మేరకు.. శనివారం తెల్లవారు జామున తిరుపతి నుంచి నెల్లూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును శ్రీకాళహస్తి నుంచి తిరుపతి వైపు వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆర్టీసీ బస్సు డ్రైవర్ కుమార్, ప్రవేట్ బస్సులో ప్రయాణికులు శారద, తన్మై, డ్రైవర్ తీవ్రంగా గాయ పడ్డారు. శ్రీకాళహస్తి వాహనాల తనిఖీ అధికారి దామోదర్‌నాయుడు, శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో మేనేజరు బాలాజీ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.



ప్రమాదానికి గురైన బస్సు

తాళం వేసిన ఇంట్లో చోరీ.. తొట్టంబేడు: తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడారు. ఈ ఘటన మండలంలోని పిల్లమేడు గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. తొట్టంబేడు ఎస్సై ఈశ్వరయ్య కథనం మేరకు..గ్రామానికి చెందిన హరిబాబు ఉపాధి నిమిత్తం తిరుపతిలో నివాసముంటున్నారు. శనివారం ఉదయం ఇంటి వైపు వెళ్లిన బంధువులకు తాళాలు తీసి ఉండడంతో అనుమానంతో హరిబాబుకి సమాచారం అందించారు. తాళాలు పగులగొట్టి ఉండటంతో పోలీసులకు సమాచారం అందించాడు. బీరువాలోని 16గ్రాముల బంగారం, 250 గ్రాముల వెండి ఆభరణాలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నైపుణ్యంతోనే ఉపాధి

తొట్టంబేడు, న్యూస్‌టుడే: నైపుణ్యం పెంపొందించుకుని నేరుగా ఉపాధి అవకాశాలు పొందాలని ఎస్వీఏ ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల పిన్సిపల్ డా.శ్రీలత పేర్కొన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని కళాశాల ప్రాంగణంలో శనివారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళాలో 43 మంది యువతి, యువకులు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందించారు. జేకేసీ సహసమన్వయకర్త గంగారాం, నైపుణ్యాభివృద్ధి సంస్థ ఉపాధి కల్పనాధికారి లక్ష్మిమోహన్, గిరిజ, వినయ్, నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రీయ సలహాలతో సత్ఫలితాలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: రబీ సీజన్ దృష్ట్యా రైతులు సాగు చేయదల్చిన పంటలకు సంబంధించి శాస్త్రీయ సలహాలు ఇవ్వాలని, తద్వారా సత్ఫలితాలు పొందే అవకాశముందని వ్యవసాయ శాఖ జిల్లా శిక్షణ సమన్వయకర్త భాస్కరయ్య అన్నారు. ఏపీసీడ్స్‌లోని సమావేశపు హాలులో శనివారం రైతు సేవా కేంద్రాల సిబ్బందితో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రబీ సాగుకు అనుకూలమైన ఆర్ఎన్ఆర్ 15048, కె.ఎన్.ఎం 733, బీపీటీ 2841, 3082, ఎన్.ఎల్.ఆర్ 34449, నెల్లూరు ధాన్య రాశి తదితర రకాల గురించి అవగాహన కల్పించారు. సమావేశంలో జిల్లా వనరుల కేంద్రం ఏవో వేణుగోపాలరావు, శ్రీకాళహస్తి ఏడీఏ రమేష్‌రెడ్డి, ఏవోలు సుధాకర్‌రెడ్డి(శ్రీకాళహస్తి), సురేందర్‌రెడ్డి(తొట్టంబేడు), మురళి(కేవీబీపురం), షణ్ముగం(ఏర్పేడు) తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ జిల్లా శిక్షణ సమన్వయకర్త భాస్కరయ్య

పీఆర్‌వో కార్యాలయ అనుమతులు అక్కర్లేదు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ దర్శనార్థం వచ్చే స్థానిక భక్తులు ఆధార్ కార్డుతో పీఆర్‌వో కార్యాలయ అనుమతులు అవసరంలేదని ఈవో చంద్రశేఖర్ ఆజాద్ స్పష్టం చేశారు. స్థానికులు ఆధార్ కార్డును మహాద్వారం వద్ద చూపించి దర్శనానికి వెళ్లవచ్చన్నారు. దళారుల నియంత్రణ లక్ష్యంగా ఈ నిర్ణయాన్ని అమల్లోకి తీసుకువచ్చామని, నిర్దేశిత సమయాల్లో స్వామి, అమ్మవార్లను దర్శించుకోవడంతో పాటు స్థానికంగా ఉన్న సిబ్బందికి సహకారం అందించాలని కోరారు.

మురుగు తొలగించారు

శ్రీకాళహస్తిగ్రామీణం(ఏర్పేడు), న్యూస్‌టుడే: శ్రీకాళహస్తి మండలంలోని రాచగున్నేరి పంచాయతీలో మురుగు తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. పంచాయతీలో పెద్దఎత్తున మురుగు పేరుకు పోవడంతో స్థానికులు రోగాలతో అవస్థలు పడుతున్నారని ఈనాడులో 'ఎన్నాళ్లిలా..?' శీర్షికతో శుక్రవారం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎంపీడీవో పఠాన్ రఫీఖాన్ పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారీచేసిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో సర్పంచి భార్గవితో చర్చించి పూర్తి స్థాయిలో శుభ్రం చేయాలన్నారు. దీంతో శనివారం జేసీబీతో పేరుకు పోయిన మురుగు తొలగించి సమస్య పరిష్కరించారు.

అమ్మ బాబోయ్.. కూడళ్లు

నిత్యం ప్రమాదాలు... ట్రాఫిక్ స్తంభన



చెక్‌పోస్టు కూడలిలో భారీ కూడలి

రేణిగుంట, న్యూస్‌టుడే: రహదారి కూడళ్లు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. సూచిక బోర్డులు, వేగ నిరోధకాలు లేని కారణంగా ఏమార్గం ఎటు వెళ్తుందో తెలియని పరిస్థితి. రేణిగుంట అనగానే వెంటనే గుర్తుకు వచ్చేది రైల్వే జంక్షన్ ఒక్కటైతే మరొకటి జాతీయ రహదారుల కూడళ్లు. రేణిగుంట మీదగా అన్ని ప్రాంతాలకు జాతీయ రహదారులు ఉన్నాయి. అయితే ఇక్కడ గతంలో ఏర్పాటైన కూడళ్లు ప్రమాదకరంగా మారాయి.

వాహనదారులకు ఇబ్బందులు

రేణిగుంట పాత చెక్‌పోస్టు కూడలిలో చిన్న కూడలి, కొత్త చెక్‌పోస్టు కూడలి వద్ద పెద్ద కూడలి, కేవీఎమ్ ఆస్పత్రి కూడలి, రామకృష్ణాపురం సమీపంలో మరో కూడలి ఉన్నాయి. వీటితో పాటు ప్రస్తుతం మర్రిగుంత వద్ద భారీ కూడలిని నిర్మించారు జాతీయ రహదారుల అధికారులు. అయితే ఈ కూడలి వద్ద ప్రమాదాలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. ఏ మార్గం ఎటువైపు వెళ్తుందో అర్థం కాని పరిస్థితులు నెలకొన్నాయి. ఒక కూడలి మినహా మరే కూడలి వద్ద ఎటువంటి సమాచారం లేవు.

కనిపించని సూచికలు, వేగనిరోధకాలు

కూడళ్ల వద్ద సూచిక బోర్డులు, వేగనిరోధకాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఎక్కడ చూసినా గజిబిజిగా మారాయి. కేవీఎమ్ ఆస్పత్రి కూడలి మరింత ప్రమాదంగా మారింది. ఇక్కడ వాహనాల సంఖ్య పెరిగినా ఎటువంటి భద్రతా చర్యలు తీసుకోలేదు. మరో పక్క చెక్‌పోస్టు వద్ద ఉన్న భారీ కూడలిలో ప్రతి రోజూ సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ స్తంభిస్తూనే ఉంటుంది. సూచిక బోర్డులు, గుంతలుగా మారిన రోడ్డులే ఇందుకు ప్రధాన కారణం. ఈ కూడలి వద్ద ఏర్పాటు చేసిన సిగ్నల్ స్తంభం కింద పడిపోయి ఏడాది అవుతున్నా ఇంత వరకు అధికారులు పట్టించుకోలేదు.

చర్యలు తీసుకుంటాం

ఇక్కడ సమస్యలను పరిశీలిస్తాం. త్వరలో తగు చర్యలు తీసుకుని చోదకులకు, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చేస్తాం.

- వెంకటేశ్వర్లు, పీడీ, జాతీయ రహదారులు



కిందపడిన సిగ్నల్

గూడూరు

•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

గూడూరులో నిమ్మ ధరలు



మొదటి రకం: కేజీ రూ. 60 నుంచి రూ. 80 వరకు

రెండో రకం: కిలో రూ. 50 నుంచి రూ. 60 వరకు

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

బ్రాయిలర్	140
లేయర్	115
బ్రాయిలర్స్	250
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	276
లేయర్ మాంసం	195

నేడు చెంగాళమ్మ ఆలయ హుండీ లెక్కింపు .. సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని చెంగాళమ్మ ఆలయంలో భక్తులు కానుకల రూపంలో హుండీల్లో సమర్పించిన సొమ్మును ఆదివారం దేవాదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యాన లెక్కించనున్నారు.

వసతిగృహాల తనిఖీ

కోట, న్యూస్‌టుడే: కోట, చిట్టేడులోని బీసీ బాలుర వసతిగృహాలను అసిస్టెంట్ వెల్ఫేర్ అధికారి వెంకటేష్ శనివారం తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ అమలును, హాజరును పరిశీలించారు. ఆయన వెంట వసతిగృహ సంక్షేమాధికారి గజేంద్ర తదితరులు ఉన్నారు.



విజేతలతో డైరెక్టర్ బాలకృష్ణంరాజు, ప్రిన్సిపల్ శాంతకుమార్

ఉత్సాహంగా ప్రతిభా పాటవ పోటీలు



పోటీలో పాల్గొన్న విద్యార్థులు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో శనివారం గూడూరు రెండో పట్టణంలోని వీఎస్‌ఆర్ పాఠశాలలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వల్ల లాభనష్టాలు- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై జరిగిన వ్యాసరచన పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సమస్యను పలు కోణాల్లో విశ్లేషించి, పరిష్కార మార్గాలను సూచించడం ద్వారా తమలోని ప్రతిభను చక్కగా ఆవిష్కరించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థులు బి.మృదుల, ఎస్.కె.నఫీసర్ రెహ్మాన్, పి.హిమకు పాఠశాల డైరెక్టర్ ఎన్.బాలకృష్ణంరాజు, ప్రిన్సిపల్ శాంతకుమార్ బహుమతులు అందజేశారు.

అధ్వాన దారులు.. తప్పని అవస్థలు

ఏళ్లు గడుస్తున్నా మారని వెంకటగిరి రూపురేఖలు



ఏకలవ్య నగర్‌లో రోడ్డు దుస్థితి



బురదమయంగా జగనన్న కాలనీలోని రోడ్డు

వెంకటగిరి, న్యూస్‌టుడే: పురపాలికగా రూపాంతరం చెంది 19 సంవత్సరాలు కావస్తున్నా నేటికీ వెంకటగిరి రూపురేఖలు మారలేదు. పట్టణంలోని 25 వార్డుల్లో దాదాపు 60 వేలకు పైగా జనాభా నివసిస్తున్నారు. తాజాగా మూడో కౌన్సిల్ పరిపాలన సాగిస్తోంది. అయినా ఇంకా అనేక వార్డుల్లో నేటికీ మట్టి రోడ్లు దర్శనమిస్తున్నాయి. చిన్నపాటి వర్షాలకు రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి.

పట్టించుకోని వైకాపా ప్రభుత్వం

గతంలో తెదేపా పాలనలో పురపాలిక పరిధిలో సిమెంట్ రోడ్డు, కాలువలు అభివృద్ధి పరిచారు. తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టి సారించలేదు. పన్నులు రూపంలో ఏటా వెంకటగిరి ప్రజలు రూ.3 కోట్ల వరకు చెల్లిస్తున్నా మౌలిక వసతులు కల్పనలో పురపాలిక వెనుకబడింది. వైకాపా ప్రభుత్వం పైసా విదల్చకపోవడంతో వార్డుల్లో అభివృద్ధి పనులు చేయలేని స్థితిలో ఉన్నామని వైకాపా కౌన్సిలర్లు వాపోయారు. పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ, బీసీ కాలనీ, సాలె కాలనీ, ఎన్జీవో కాలనీ, ఉపాధ్యాయనగర్, ఏకలవ్య నగర్, రాణిపేట, బొగ్గులమిట్ట, కుమ్మరిమిట్ట తదితర ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగా ఉన్నాయి.

జగనన్న కాలనీలో మరీ దారుణం

వెంకటగిరి-తిరుపతి మార్గంలో దాదాపు 80 ఎకరాల్లో జగనన్న కాలనీ ఏర్పాటు చేశారు. ఇక్కడ దాదాపు 2400 మందికి గృహాలు మంజూరు చేశారు. గత ప్రభుత్వంలో ఇక్కడ రోడ్ల కోసం రూ.2 కోట్ల వరకు వెచ్చించి మట్టిరోడ్లు, నేల చదును పనులు చేపట్టారు. క్రమేణా ఇక్కడ గృహ నిర్మాణాలు చేసుకుంటున్నా సరైన రోడ్డు వసతి లేక స్థానికులు నానా అగచాట్లు పడుతున్నారు. నేటికి ప్రధాన రోడ్డును అభివృద్ధి పరిచిన దాఖలాలు లేవు. ఈ రోడ్డు మరమ్మతులకు రూ.లక్షలు ఖర్చు చేస్తున్నా ప్రయోజనం లేకుండా పోయింది. రోడ్డు నిర్మాణం చేపట్టిన గుత్తేదారుడు సమీప చెరువు మట్టిని తోలి మమ అనిపించి బిల్లులు చేసుకున్నారు. ఈ కాలనీలో అంతర్గత వీధుల పరిస్థితి మరి దారుణం. వర్షం కురిస్తే రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. గృహ నిర్మాణాలు చేసుకునేందుకు అవసరమైన వస్తువులు తీసుకెళ్లాలన్నా నానా తిప్పలు పడాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు.

పురపాలిక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

ప్రస్తుతం కూటమి పాలనలో పురపాలికలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాం. 25 వార్డుల్లో చేపట్టాల్సిన పనులపై ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశాం. పనుల వివరాలు కూడా సేకరించాం. త్వరితగతిన సిమెంట్ రోడ్లు, కాలువ నిర్మాణాలు చేపడతాం.

- కురుగొండ్ల రామకృష్ణ, ఎమ్మెల్యే

మేమున్నాం.. మీకు తోడుగా..

గూడూరు : 85002 02046
నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 96188 78782
వెంకటగిరి : 80085 73966
సమయం 10 AM TO 1 PM

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే:

సమస్య: గూడూరులోని రాణిపేట ప్రాంతంలో రోడ్డుపై చెత్తాచెదారాలు ఉండటంతో దుర్వాసన భరించలేకున్నాం. చెత్త తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- సూర్య, గూడూరు

సమాధానం: సిబ్బందితో వెంటనే తొలిగించేలా చర్యలు తీసుకుంటాం. చెత్త రోడ్లపై వేయకుండా.. సిబ్బందికి ఇళ్ల వద్ద అందించి ప్రజలు సహకరించాలి.

- వెంకటేశ్వర్లు, కమిషనర్, గూడూరు

కోట, న్యూస్‌టుడే

సమస్య: గూడలి సమీపంలోని ర.భ. రోడ్డుకు ఇరువైపుల కొబ్బరికాయల వ్యర్థాలు గుట్టలుగా వేస్తున్నారు. వర్షాలతో డెంగీ దోమలు చేరే అవకాశముంది. అధికారులు తొలగించాలి. **- నాగమణి, స్థానికురాలు**

సమాధానం: పరిశీలించి తొలగిస్తాం.

- కిరణ్‌కుమార్, ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే:

సమస్య: నాయుడుపేట సీఎస్ తేజా సెంటర్ వద్ద జాతీయ రహదారి మలుపులో సెంటర్ లైటింగ్ దీపాలు వెలగడం లేదు. చీకట్లో వాహనాలు ఢీకొంటున్నాయి.

- సుబ్రహ్మణ్యం, స్థానికుడు

సమాధానం: దీపాలు బాగు చేసి వెలిగేలా చేస్తాం.

- ఫజులుల్లా, కమిషనర్

సిమెంటు రోడ్డుకు భూమిపూజ

బాలాయపల్లి, న్యూస్‌టుడే: పెరిమిడి పంచాయతీ బొల్లవారిపాళెం ప్రధాన వీధిలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు. వీధి అధ్వానంగా ఉందని ఈ నెల 16న 'మేమున్నాం.. మీకు తోడుగా'లో ప్రచురితమైంది. ఈ క్రమంలో 'పల్లె పండుగ' కార్యక్రమంలో భాగంగా వీధిలో సిమెంటు రోడ్డు నిర్మించేందుకు అధికారులు కొబ్బరికాయ కొట్టారు.

స్పందనకు వందనం

వీధిదీపం వెలిగేలా చర్యలు

సూళ్లూరుపేట: స్థానిక సోనియాగాంధీ నగర్‌లో వీధిదీపం వెలగక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని 'మేమున్నాం.. మీకుతోడుగా'లో ప్రచురితమైంది. కమిషనర్ కె.చిన్నయ్య స్పందించి వీధిదీపం వెలిగేలా చర్యలు చేపట్టారు.



బాలికలకు సూచనలు చేస్తున్న జూనియర్ సివిల్ న్యాయమూర్తి అనూష

బాలికలు చట్టాలు తెలుసుకోవాలి

వెంకటగిరి, న్యూస్‌టుడే: బాలికలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జూనియర్ సివిల్ న్యాయమూర్తి అనూష అన్నారు. పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాలలో శనివారం చట్టాలు, సామాజిక పరిస్థితులు; పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ఎవరైనా బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే నేరుగా న్యాయస్థానంలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. బాలికలు, మహిళల కోసం అనేక చట్టాలు ఉన్నాయన్నారు. చక్కగా అభ్యసించి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. అనంతరం వంటగది, భోజన శాలను పరిశీలించారు. ఈ క్రమంలోనే న్యాయస్థానం ప్రాంగణంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

అధ్యాపకురాలికి డాక్టరేట్

కోట, న్యూస్‌టుడే: కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ సైన్సు అండ్ ఆర్ట్స్ కళాశాలలో కంప్యూటర్ విభాగ అధ్యాపకురాలు వల్లీదేవి పరిశోధనలకు ఉత్తరప్రదేశ్‌లోని జేఎస్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ క్రమంలోనే శనివారం డాక్టరేట్ పొందిన వల్లీదేవిని అభినందించారు. 'అధునాతన మెషిన్ లెర్నింగ్ టెక్నిక్స్ ద్వారా కనెక్టు చేయబడిన అటానమస్ వెహికల్స్ సైబర్ సెక్యూరిటీ' అనే అంశంపై ప్రొఫెసర్ విజయభాస్కర్ పర్యవేక్షణలో పరిశోధనలు చేశారు. కార్యక్రమంలో మేనేజర్ రామకృష్ణారెడ్డి, విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ స్వీపర్‌కు వేతనం పెంచాలి

వెంకటగిరి, న్యూస్‌టుడే: పాఠశాలలో పనిచేసే స్వీపర్లకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు చెంగయ్య అన్నారు. ఈ మేరకు ఎంఈవో వెంకటేశ్వర్లుకు శనివారం వినతిపత్రం అందించారు. పాఠశాలలో పనిచేసే కార్మికుల సమస్యలపై 21న ధర్నా చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రసాద్, సుబ్రహ్మణ్యం, రమణయ్య పాల్గొన్నారు.



భిక్షాటన చేస్తున్న అయ్యప్ప స్వాములు

నేటి నుంచి అన్నప్రసాద వితరణ

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని తితిదే కల్యాణ మండపంలోని ధర్మశాస్త్ర అయ్యప్ప మందిరంలో ఆదివారం నుంచి ఉచిత అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 41 రోజులు పాటు అయ్యప్ప, గోవింద, శివ మాలధారణ స్వాములకు నిత్యం అన్న ప్రసాద వితరణ చేయనున్నట్లు వివరించారు. ఈ క్రమంలో ధర్మశాస్త్ర అయ్యప్ప భక్తబృందం సభ్యులు పట్టణ వీధుల్లో భిక్షాటన చేపట్టారు.

రెవెన్యూ సభల్లో సర్వే సమస్యలకు పరిష్కారం



పెళ్లకూరు: అధికారులకు విన్నవిస్తున్న రైతు

నాయుడుపేట, న్యూస్‌టుడే: రెవెన్యూ గ్రామ సభల్లో సర్వే సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఉంటుందని తహసీల్దారు గీతావాణి తెలిపారు. శనివారం చిగురుపాడు గ్రామంలో జరిగిన సభలో ఆమె మాట్లాడారు. ఈనెల 21న చిగురుపాడు అగ్రహారం, 22న లంకపాళెం, 23న యర్రపుశెట్టిపాళెం, 24న వద్దిగుంటకండ్రిగ, 25న ద్వారకాపురం 26న తన్నమాల, 28న రావూలగుంట, 29న పుదూరు, 30న అరవపెరిమిడి, నవంబరు 1న చిలమత్తూరు, 2న కుచివాడ, 4న కాపులూరు, 5న వేమగుంటపాళెం, 6న పండ్లూరు, 7న కల్లిపేడు, 8న అయ్యప్పరెడ్డిపాళెం, 11న మర్లపల్లి, 12న జువ్వలపాళెం, 13న కారుమంచివారికండ్రిగ, 14న బిరదవాడ, 16న ఎల్.ఏ సాగరం గ్రామాల్లో రెవెన్యూ గ్రామ సభలు జరుగుతాయన్నారు. భూసర్వే సమస్యలున్న రైతులు హాజరై సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.

పెళ్లకూరు, న్యూస్‌టుడే: రీసర్వే గ్రామసభల్లో రైతులు వారి సమస్యలు పరిష్కరించుకోవాలని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు కందమూడి శివకుమార్ తెలిపారు. జీలపాటూరులో శుక్రవారం జరిగిన సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ జీలపాటూరులో లెక్కకు మించి సమస్యలున్నట్లు చెప్పారు. ఆర్ఐ సంతోషిబాయి, వీఆర్వో వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామికి గ్రామోత్సవం

తడ, న్యూస్‌టుడే: పెరటాసి మాసం ఐదో శనివారం సందర్భంగా తడకండ్రిగలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం వేడుకగా జరిగింది. ఉదయం స్వామికి ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించి, పూజలు నిర్వహించారు. అనంతరం మహాభిషేకం జరిపారు. రాత్రి ప్రత్యేక రథంపై ఉత్సవ మూర్తిని సిద్ధంచేసి గ్రామ వీధుల్లో ఊరేగించారు.

'పల్లె పండగ' భూమిపూజలు

నాయుడుపేట, న్యూస్‌టుడే: భీమవరం పంచాయతీలో సీసీరోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులకు సర్పంచి అమృత సరళతో కలిసి మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం భూమిపూజ చేశారు. మాజీ ఎంపీపీ తుపాకుల కన్నెమ్మ, ఉప సర్పంచి గోనుబాబు పాల్గొన్నారు. **సూళ్లూరుపేట, న్యూస్‌టుడే:** మండలంలోని 19 పంచాయతీల్లో రూ.1.40 కోట్లతో 21 పనులు చేపడుతున్నామని దామానెల్లూరు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మునిగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సుగ్గుపల్లిలో సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ● **నాయుడుపేట, ఓజిలి:** నాయుడుపేట మండలంలోని గొట్టిప్రోలు, కాపులూరు, చిలమత్తూరు, కల్లిపేడు, పండ్లూరు, పుదూరు, అరవపెరిమిడి తిమ్మాజీకండ్రిగ, చిగురుపాడు, భీమవరం పంచాయతీల్లో రూ1.40 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఓజిలి మండలం చిలమానుచేను, అత్తివరం, గుర్రంకొండ, కార్జీమేడు, ఓజిలి అరుంధతీయవాడ పంచాయతీలో అభివృద్ధి పనులకు భూమిపూజలు చేశారు.

● **పెళ్లకూరు, న్యూస్‌టుడే:** చావలి బీసీ కాలనీలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు.



భీమవరంలో సీసీరోడ్లకు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం తదితరులు




ఎల్ఏసాగరం వద్ద మిరప తోటలోని నీటిని బయటకు పంపుతున్న రైతు శీనయ్య

వర్షపు నీటిలో ఉద్యాన పంటలు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేటలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షంతో వీధులు జలమయం అయ్యాయి. ఉద్యాన పంటల్లోకి నీరు చేరింది. రైతులు నీరు బయటకు తీసి కాపాడుకునే ప్రయత్నం చేశారు. మండలంలోని పుదూరు, జువ్వలపాళెం, ఎల్ఏసాగరం, తిమ్మాజీకండ్రిగ తదితర గ్రామాల పరిధిలో సాగు చేస్తున్న కూరగాయల పంటలకు ఇబ్బందిగా మారింది. నాయుడుపేట, పెళ్లకూరు మండలాల్లో ఈ సీజన్‌లో వందల ఎకరాల్లో మిరప సాగు చేస్తారు. కొన్ని రోజులుగా నాట్లు వేస్తున్నారు. మిరప నారు దెబ్బతినే అవకాశముంది.

డివైడర్లపై మొక్కల తొలగింపు



నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: పురపాలికలోని డివైడర్లపై చెట్లను నేలవాలుస్తున్నారు. ఇప్పటి వరకూ పచ్చదనంతో కళకళలాడిన చెట్లు నరికేయడంతో మోడుబారి దర్శనమిస్తున్నాయి. రూ.లక్షల నిధులతో మొక్కలు నాటడం.. పెరిగాక నరకడం చేస్తున్నారు. కమిషనర్ ఫజులుల్లాను వివరణ కోరగా.. పర్యావరణానికి హాని కలిగిస్తున్నాయని తొలగిస్తున్నట్లు చెప్పారు.



గుంతలో ఇరుక్కున్న భారీ వాహనం

నాయుడుపేట, న్యూస్‌టుడే: స్థానిక పాత ట్రెజరీ రోడ్డులోని గుంతలో శనివారం భారీ వాహనం దిగి ఇరుక్కుంది. దీంతో నాయుడుపేట నుంచి మేనకూరు పారిశ్రామికవాడకు వెళ్లే వాహనాలు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎక్కడికక్కడ స్తంభించాయి.

కాలువ పూడికతీతకు శ్రీకారం

ఈనాడు కథనానికి స్పందన

కోట, న్యూస్‌టుడే: కోట బస్టాండ్ రోడ్డు నుంచి ఎన్‌సీఆర్‌నగర్ వరకు మురుగు కాలువ ఆక్రమణలను ఈవో రాజశేఖర్ యంత్రాలతో తొలగించి శుభ్రం చేయించారు. ర.భ అధికారులు నిర్మించిన ఈ కాలువపై ఆక్రమణలు ఉండటంతో మురుగు కదలడం లేదని 'ఈనాడు'లో గత నెల 25న 'రోడ్డుపైనే పారుతున్న మురుగు' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు జేసీబీతో కాలువ పూడిక తీసి ఆక్రమణలు తొలగిస్తున్నారు.

కౌన్సిలర్‌పై చర్యలు తీసుకోవాలి

వెంకటగిరి, న్యూస్‌టుడే: సచివాలయం ఉద్యోగి వెంకటసాయిపై దాడి చేసిన కౌన్సిలర్ నారిశేఖర్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు రాష్ట్ర ఉద్యోగుల సంఘం ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది వినతిపత్రం అందించారు. న్యాయం చేస్తామని ఎమ్మెల్యే రామకృష్ణ తెలిపారు. రాష్ట్ర ఉద్యోగుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్

దాడి కేసులో నిందితుల అరెస్టు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరు ఇందిరానగర్ ప్రాంతంలో అత్తామామలైన మర్రివాసి ధనమ్మ, చెంచుకృష్ణలపై ఈ నెల 13న అల్లుడు గుత్తి సుబ్రహ్మణ్యం, మరికొందరితో కలిసి దాడి చేసిన ఘటనలో ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. మామ చెంచుకృష్ణ, అల్లుడు సుబ్రహ్మణ్యం కలిసి కొన్నేళ్ల క్రితం రమేష్ అనే వ్యక్తికి రూ.20 లక్షల నగదు అప్పుగా ఇచ్చారు. అప్పు చెల్లించలేకపోయిన అతను గంపలగూడెంలోని తన ఇంటిని వీరిద్దరికీ రాసి ఇచ్చారు. ఆ ఇంటిని చెంచుకృష్ణకు తెలియకుండా సుబ్రహ్మణ్యం అమ్మేశాడు. దీంతో చెంచుకృష్ణ, సుబ్రహ్మణ్యంల మధ్య నగదు విషయమై గొడవలు జరిగాయి. ఈ క్రమంలో కుమార్తె మహాలక్ష్మితోనూ చెంచుకృష్ణ గొడవ పడ్డాడు. మామకి నగదు ఇవ్వకూడదనే ఉద్దేశంతో ఈ నెల 13వ తేదీ తన బంధువులైన ఉమ్మడి కృష్ణా జిల్లా విస్సన్నపేటకు చెందిన గుత్తి మనోహర్, గుత్తి విజయ్, గుత్తి భాస్కర్, గుత్తి సురేష్, గుత్తి రాజేష్, నలబాయి నరసింహలతో కలిసి సుబ్రహ్మణ్యం గూడూరుకి వచ్చి అత్తమామలు చెంచుకృష్ణ, ధనమ్మ, బావమరిది చెంచురామయ్యలపై రాడ్లతో దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. ఈ మేరకు బాధితులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. గూడూరు రైల్వే పార్సిల్ కార్యాలయం వద్ద నిందితులున్నారనే సమాచారంతో పోలీసులు సుబ్రహ్మణ్యంతో పాటు విజయ్, భాస్కర్, సురేష్, రాజేష్, నరసింహలను శనివారం అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు మనోహర్ పరారీలో ఉన్నాడని, అరెస్టు చేసిన వారిని కోర్టులో హాజరు పరుచనున్నట్లు సీఐ తెలిపారు. ఎస్సైలు సుబ్రహ్మణ్యంరాజు, గోపాల్‌యాదవ్, సిబ్బంది చిరంజీవులు, సురేష్, నాగేంద్ర, సతీస్, మధు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ఆభరణాల చోరీ

బాలాయపల్లి, న్యూస్‌టుడే: చిలమనూరు పంచాయతీ గొల్లగుంటలోని పాండురంగని ఆలయంలో చోరీ జరిగినట్లు ఏఎస్ఐ రామేశ్వరరావు తెలిపారు. రెండు రోజుల కిందట ఆరు గ్రాముల ఆభరణాలను అపహరించారని గ్రామస్థులు ఇచ్చిన వివరాల మేరకు ఈ ఘటనపై కేసు నమోదు చేశామన్నారు.

పిడుగుపాటుకు ఇల్లు ధ్వంసం

బాలాయపల్లి, న్యూస్‌టుడే: గొట్టికాడు గ్రామంలో శనివారం పిడుగుపాటుకు ఓ ఇంట్లోని విద్యుత్తు ఉపకరణాలు ధ్వంసమయ్యాయి. ఎం.సుబ్రహ్మణ్యంకు చెందిన రెండంతస్తుల భవనంపై పిడుగు పడి కొంత మేర గోడలు దెబ్బతిన్నాయి. రూ.లక్షన్నరకుపైగా విలువ చేసే పలు విద్యుత్ గృహోపకరణాలు పాడైనట్లు బాధితులు తెలిపారు. వీఆర్వో, గ్రామ కార్యదర్శి పరిశీలించి ఇచ్చిన వివరాలను కలెక్టరేట్‌కు నివేదించినట్లు తహసీల్దారు శ్రీనివాసులు పేర్కొన్నారు.

ఉపాధ్యాయుడు లేని పాఠశాల

● సీఆర్‌ఎంటీనే దిక్కు
● విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: పులికాట్ తీరంలోని ఓ పాఠశాలలో కొన్ని నెలలుగా ఉపాధ్యాయుడే లేరు. కేవలం సీఆర్‌ఎంటీ(క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్)నే విద్యార్థులకు దిక్కుగా మారి విద్యాబుద్ధులు నేర్పుతున్నారు. ఇటీవల విద్యాశాఖ జిల్లాలో మండలాల వారీగా మిగులు ఉపాధ్యాయులను గుర్తించి, అవసరమైన చోటకు బదిలీ చేశారు. ఇంత జరిగినా పులికాట్ తీరంలోని పాఠశాలకు మాత్రం ఎవర్నీ నియమించలేదు.

సూళ్లూరుపేట మండలంలోని పులికాట్ తీరంలో కడపట్ర పంచాయతీ పరిధిలో చెరువుమిట్ట గ్రామం ఉంది. ఇక్కడి ప్రాథమిక పాఠశాలలో ఏడాదిగా ఉపాధ్యాయుడు లేరు. గతంలో రెగ్యులర్ ఉపాధ్యాయుడు పనిచేస్తూ.. ఎవరికీ సమాచారమివ్వకుండా పాఠశాలకు రాకుండా మానేశారు. ఇలా 10, 15 రోజులు కాదు.. కొన్ని నెలలు చేశారు. అప్పట్లో సీఆర్‌ఎంటీని ఏర్పాటు చేసి, పాఠశాలను నిర్వహించారు. ఈ విద్యా సంవత్సరానికి కొన్ని నెలల ముందు ఆయన వచ్చి విధుల్లో చేశారు. అతనిపై విద్యాశాఖ ఎలాంటి చర్యలు తీసుకోకుండా నో వర్క్.. నో పే కింద చూపించారు. ఆ తర్వాత సాధారణ బదిలీల్లో వేరే చోటకు వెళ్లారు. అప్పటి నుంచి నేటి వరకు ఇక్కడ ఉపాధ్యాయుడి నియామకం జరగలేదు. కేవలం సీఆర్‌ఎంటీనే అన్నింటికీ దిక్కుగా మారారు. అదీ రొటేషన్ సిస్టమ్‌లో సీఆర్‌ఎంటీలను ఈ పాఠశాల విధులకు కేటాయించడం లేదు. ఒక్కరినే నిరంతరాయంగా కొనసాగిస్తున్నారు. పాఠశాలలో ఉపాధ్యాయుడు లేకుండానే పరీక్షలు నిర్వహించేస్తున్నారు. దీనిపై గ్రామస్థుల నుంచి వ్యతిరేకత వస్తోంది. ఎన్నిసార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు చెప్పినా తమ పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి మండలంలోనూ మిగులు సిబ్బందిని గుర్తించి, ఇతర పాఠశాలలో వారిని సర్దుబాటు చేశారు. చెరువుమిట్ట పాఠశాలకు మాత్రం విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయుడిని నియమించలేకపోయారు.



చెరువుమిట్ట పాఠశాలలో బోధిస్తున్న సీఆర్‌ఎంటీ

త్వరలోనే నియమిస్తాం

చెరువుమిట్ట పాఠశాలకు త్వరలోనే ఉపాధ్యాయుడిని నియమిస్తాం. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ప్రస్తుతం సీఆర్‌ఎంటీ ద్వారా తరగతులు నిర్వహిస్తున్నాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

- కె.శ్రీనివాసులు, ఎంఈవో

విద్యార్థుల నిరసన

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేటలో శనివారం మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా విద్యార్థులు భారీ నిరసన ప్రదర్శన చేశారు. స్థానిక చేయూత, గ్రామజ్యోతి స్వచ్ఛంద సంస్థలు, ఐసీడీఎస్, రెవెన్యూ అధికారులు, విక్రమ్ ప్రైవేటు కళాశాల విద్యార్థులు అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. సీడీపీవో ఉమామహేశ్వరి, చేయూత సంస్థ నిర్వాహకులు కృష్ణయ్య, కళాశాల నిర్వాహకులు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విష పురుగు కాటుకు బాలిక మృతి



యోగశ్రీ

తడ, న్యూస్‌టుడే: విష కీటకం కాటుకు గురై బాలిక యోగశ్రీ(11) మృతిచెందిన సంఘటన మండలంలోని కారూరులో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ప్రభాకర్‌రెడ్డి, పర్మిళ దంపతులకు ఇద్దరు పిల్లలు. యోగశ్రీ రెండో సంతానం. తమిళనాడు పరిధిలోని ఆరంబాకంలో ఆరో తరగతి చదువుతోంది. ఎప్పటిలాగే గురువారం రాత్రి పిల్లలు ఇద్దరు తల్లిదండ్రులతో నిద్రించారు. శుక్రవారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో యోగశ్రీ లేచి తన తల్లిని నిద్రలేపి మూత్ర విసర్జనకు వెళ్లాలంది. తల్లి పర్మిళ వెంటరాగా యోగశ్రీ ఇంటి బయటకు వెళ్లి వచ్చి పడుకుంది. కొంతసేపటికి అస్వస్థతకు గురైంది. దాంతో తల్లిదండ్రులు బాలికను హుటాహుటిన తడలో ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం చెన్నై మెరిడియన్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ సరిపడనంత డబ్బులు చెల్లించలేక ఎగ్మూరు పిల్లల ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున యోగశ్రీ ప్రాణాలు కోల్పోయింది. తడ పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమార్తె ఇక లేదన్న విషయం తెలిసి తల్లిదండ్రులు, బంధువులు బోరున విలపిస్తున్నారు.